PRGI Regd. No : APTEL/26/A4268

# సలాం ప్రొద్దుటూరు

తెలుగు మాసపత్రిక

సంపుటి : 01 సంచిక : 03 | వైయస్ఆర్ కడప/అన్నమయ్య | ఎడిటర్ : బి.ఎస్.ఖాజామొహిద్దీన్ | జూలై 2026 | పేజీలు : 16 | వెల.రూ.10/-

## కంపెనీ సెక్రటరీ కోర్సులో రైతు బిడ్డ ప్రతిభ

వేంపల్లె : వేంపల్లె గ్రామీణ పరిధిలోని కుప్పాలపల్లెకు చెందిన రైతు బిడ్డ కుడుముల జయంత్ కుమార్ రెడ్డి కంపెనీ సెక్రటరీ కోర్సులో అత్యుత్తమ ప్రతిభ చాటారు. గ్రామానికి చెందిన ప్రభాకరరెడ్డి, కృష్ణకుమారిల కుమారుడైన జయంత్ కుమార్ రెడ్డి.. ఢిల్లీ కేంద్రంగా ఉన్న 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా' ప్రవేశ పరీక్ష రాసి ప్రతిభ కనబరిచారు. అనంతరం ఐదేళ్ల కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. ఇటీవల కేరళ రాష్ట్రం త్రివేంద్రంలో నిర్వహించిన వర్సిటీ స్నాతకోత్సవంలో **ICSI** ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పవన్, ద్వారకనాథ్ ల చేతుల మీదుగా జయంత్ కుమార్ రెడ్డి తన పట్టాను అందుకున్నారు. రైతు కుటుంబానికి చెందిన యువకుడు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి పట్టా పొందడం పట్ల గ్రామస్థులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## ప్రధాని మోడీకి ఫోన్ చెయ్.. అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో డోనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు



వాషింగ్టన్: భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య ఉన్న బలమైన స్నేహ బంధాన్ని చాటిచెప్పే ఒక ఆసక్తికర సంఘటనను అమెరికా రాయబారి సెర్జియో గోర్ ఇటీవల వెల్లడించారు. అమెరికా–భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య లీడర్‌షిప్ సమిట్ వేదికగా ఆయన ఈ వివరాలను పంచుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 11న మయామిలో జరిగిన 'గాలా 327' ఈవెంట్ సందర్భంగా.. ప్రధాని మోడీకి ఫోన్ చేయాలని ట్రంప్ అనుకున్నారు. ఆ సమయంలో భారత్‌లో ఉదయం 6 గంటలు అవుతుందని, అది సరైన సమయం కాదని రాయబారి సెర్జియో గోర్ గుర్తుచేశారు. రాయబారి వారించినప్పటికీ ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. "మోడీ ఈపాటికే మేల్కొని ఉంటారు, ఆయన కూడా నాలాగే చాలా తక్కువ సమయం నిద్రపోతారు" అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు గోర్ తెలిపారు. అయితే, ట్రంప్ స్టేజీ పైకి వెళ్లాల్సి రావడంతో ఆ కాల్ మరుసటి రోజుకు షెడ్యూల్ చేయబడింది. నిజమైన స్నేహం ఉన్నప్పుడు ప్రతి విషయానికి షెడ్యూల్స్ అవసరం లేదని ఈ ఘటన నిరూపిస్తోందని గోర్ పేర్కొన్నారు. ప్రపంచంలోని ఇతర నేతలతో ట్రంప్ కేవలం అధికారికంగానే వ్యవహరిస్తారని, కానీ ప్రధాని మోడీతో ఆయనకు ప్రత్యేకమైన అభిమానం మరియు అనుబంధం ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

## పారిశ్రామిక రంగంలో ఏపీ ఊహించని ప్రగతి: మంత్రి టీజీ భరత్



అమరావతి : ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో ఊహించని ప్రగతిని సాధించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ టీజీ భరత్ స్పష్టం చేశారు. స్పేస్, డ్రోన్ సిటీల అభివృద్ధి నుంచి గ్రీన్ హైడ్రోజన్ రంగం వరకు రాష్ట్రం ఎంతో పురోగతి సాధిస్తోందని ఆయన పేర్కొన్నారు. అమరావతిలో జరిగిన ఒక సమావేశంలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. గత ఐదేళ్ల పాలనతో పోలిస్తే, కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ల కాలంలోనే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో అత్యుత్తమ అభివృద్ధిని నమోదు చేసిందని మంత్రి వివరించారు. 2019 నుండి 2024 వరకు ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల సంఖ్య పూర్తిగా పడిపోయిందని, ఆ కాలంలో పారిశ్రామిక వృద్ధి కుంటుపడిందని మంత్రి టీజీ భరత్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

## విశాఖపట్నం చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము: ఘనస్వాగతం పలికిన మంత్రి లోకేష్



విశాఖపట్నం తాజావార్త: భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము జూన్ 30న విశాఖపట్నం చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి శ్రీ నారా లోకేష్ ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయంలో స్వాగతం పలికిన వారిలో మంత్రితో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ



అమరావతి తాజావార్త: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్.. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్‌తో కీలక సమావేశం నిర్వహించారు. జూన్ 30న జరిగిన ఈ భేటీలో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన పలు అటవీ, వన్యప్రాణుల సంరక్షణ అంశాలపై చర్చించారు. తూర్పు కనుమల పరిధిలో పులుల సంరక్షణకు తీసుకోవాల్సిన ఉమ్మడి చర్యలపై ఇరు రాష్ట్రాల నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల అభివృద్ధిలో భాగంగా మహారాష్ట్ర ప్రభుత్వం ఏపీకి రెండు ఆడపులులను అందించేందుకు అంగీకరించింది. ఈ సానుకూల నిర్ణయం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. దేవేంద్ర ఫడ్నవీస్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## ముంబై కోకిలా బెన్ ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌కు వైద్యపరీక్షలు... వెంటనే శస్త్రచికిత్స చేయాలన్న డాక్టర్లు



అమరావతి తాజావార్త జూన్ 30: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఆయన చేతి కండరాలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే సర్జరీ చేయాలని సూచించారు. అయితే, రాష్ట్రానికి సంబంధించిన అధికారిక కార్యక్రమాలు, పరిపాలనా విధులు పూర్తయిన తర్వాతే తాను శస్త్రచికిత్స చేయించుకుంటానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సోమవారం నాడు తన భార్య అన్నా లెజినోవాతో కలిసి పవన్ ముంబై వెళ్లిన సంగతి తెలిసిందే. ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌కు వైద్య పరీక్షలు పూర్తయ్యాయి. ఆయన రెండు భుజాలను క్షుణ్ణంగా పరీక్షించిన వైద్య బృందం, రొటేటర్ కఫ్‌తో పాటు చేతికి సంబంధించిన రెండు కండరాలకు తీవ్ర గాయమైనట్టు గుర్తించింది. గాయం తీవ్రత ఎక్కువగా ఉన్నందున, తక్షణమే శస్త్రచికిత్స చేయించుకోవడం ఉత్తమమని వైద్యులు సిఫార్సు చేశారు. ఈ మేరకు ఆయనకు పూర్తి నివేదికను అందజేశారు. అయితే, వైద్యుల సూచనపై స్పందించిన పవన్ కల్యాణ్ తన నిర్ణయాన్ని వెల్లడించారు. ముందుగా నిర్దేశించుకున్న ప్రభుత్వ కార్యక్రమాలను, పరిపాలనా బాధ్యతలను పూర్తి చేయడం తన కర్తవ్యమని ఆయన భావించారు. ఈ కార్యక్రమాలన్నీ ముగిసిన తర్వాతే శస్త్రచికిత్స కోసం ఆసుపత్రిలో చేరతానని తెలిపారు. ఈ మేరకు అధికారిక కార్యక్రమాలను పూర్తి చేసుకుని తిరిగి వస్తానని ఆయన పేర్కొన్నారు. కాగా, పవన్ కల్యాణ్ గత కొంతకాలంగా చేతి నొప్పితో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. రెండు చేతుల కండరాలు పూర్తిగా దెబ్బతినడంతో పాటు, రొటేటర్ కఫ్ గాయంతో ఆయన అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్నికల ప్రచార సమయంలోనూ ఈ నొప్పి ఆయన్ను వేధించింది

## రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్.



హైదరాబాద్ : తాజావార్త : జూన్ 30: వానాకాలం సీజన్ కోసం రైతు భరోసా నిధులను విడుదల చేశారు సీఎం రేవంత్ రెడ్డి. మంగళవారం (జూన్ 30) హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన రైతు భరోసా సదస్సులో నిధులు విడుదల చేశారు. తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయల పంపిణీ పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొదటి దశలో 2 ఎకరాల లోపు ఉన్న రైతుల అకౌంట్లో నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా అర్హులైన రైతులందరికీ దశలవారీగా ఈ పెట్టుబడి సాయాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నట్లు సీఎం రేవంత్ చెప్పారు. పెట్టుబడి సాయం కింద ప్రతి రైతు అకౌంట్లో ఎకరాకు 12 వేల రూపాయల ఆర్థిక సాయం అందించే క్రమంలో.. తొలి విడత రెండు ఎకరాలలోపు ఉన్న రైతుల ఖాతాల్లోకి నిధులు విడుదల చేశారు. తెలంగాణలో మొత్తం 73.32 లక్షల మంది రైతులకు ఈ సాయం అందనుంది. మొదటి దశలో భాగంగా ఎకరాకు రూ. 6 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నారు. మొదటి విడతలో 2 ఎకరాల వరకు భూమి ఉన్న 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి నిధులు విడుదల చేశారు. రైతు భరోసా ఆర్థిక సాయం కోసం కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు అప్లై చేసుకోవాల్సి ఉంటుంది. తమ వివరాలను సమీప వ్యవసాయ విస్తరణ అధికారికి (ఏఈఓ) జూలై 5వ తేదీలోపు అందజేయడం ద్వారా ఈ పథకానికి అర్హులు అవుతారు. నిధుల విడుదలపై పూర్తి వివరాలు, ఖాతాలో డబ్బులు పడ్డాయో లేదో తెలుసుకోవడానికి అధికారిక పోర్టల్‌లను లేదా మీ గ్రామ వ్యవసాయ అధికారిని సంప్రదించవచ్చు




అమరావతి: ఆంధ్రప్రదేశ్ గనుల శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఖనిజ వనరుల ద్వారా ఆదాయాన్ని గరిష్టంగా పెంచేందుకు ఉన్న అవకాశాలపై అధికారులతో చర్చించారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము వంటి ఖనిజాలను కేవలం తవ్వడమే కాకుండా, రాష్ట్రంలోనే వాటికి విలువ జోడింపు ప్రక్రియ చేపట్టడం ద్వారా గరిష్ట రెవెన్యూ సాధించవచ్చని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం మార్కెట్ క్యాపిటలైజేషన్ అవకాశాలపై సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో లభించే అరుదైన ఖనిజాల కోసం ఒక ప్రత్యేక 'రేర్ ఎర్త్ క్లస్టర్' ఏర్పాటును సీఎం ప్రతిపాదించారు. ఎలక్ట్రానిక్స్, రక్షణ రంగాల్లో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా సాగాలని, అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవడానికి ఇసుక రీచ్‌లలో సీసీటీవీ కెమెరాలు, శాటిలైట్ నిఘా, జీపీఎస్ ట్రాకింగ్ వంటి అధునాతన సాంకేతికతను వాడాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటికే 126 వ్యూహాత్మక ఖనిజ నిక్షేప ప్రాంతాలను గుర్తించామని, ప్రస్తుతం గనుల ఆదాయం 18% పెరిగిందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తదితరులు పాల్గొన్నారు.

# కడప నగరం లో రోజురోజుకు పెట్రేగుతున్న హిజ్రాల ఆగడాలు



వైస్సార్ కడప : : నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఓ బార్ వద్ద హిజ్రాలు హాల్ చల్ చేసారు. మద్యం సేవించి బార్ కు వచ్చిన ఇద్దరు వ్యక్తులతో గొడవకి దిగారు. అనంతరం గుంపుగా వచ్చిన హిజ్రాలు ఇద్దరు వ్యక్తులపై అతి కిరాతకంగా దాడి చేసారు. అర్ధరాత్రి 1 టౌన్ పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్న బాధితులను చూసి.. తమకు న్యాయం చేయాలని రివర్స్ లో హిజ్రాల నిరసనను వ్యక్తం చేశారు. కడప నడిబొడ్డున ఇంత జరిగినా ఇంతవరకు ఎటువంటి కేసు నమోదు చేయని వైనంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో హిజ్రాలు.. ఇళ్ల ప్రారంభోత్సవాలు, భవనాలు, దుకాణాల ప్రారంభోత్సవాల వద్దకు చేరుకుని హంగామా చేస్తున్న విషయం తెలిసిందే.అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే శాపాలు పిడిగుద్దులకు పాల్పడుతున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు. నగర శివారు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ వద్ద బలవంతపు వసూళ్లకు పాల్పడి దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోతున్నారు. పోలీసులు, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి హిజ్రాల నుండి సామాన్య ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం

# విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలి



నకిరేకల్ : విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేసి ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని మండలంలోని ఎల్లారెడ్డిగూడెం, నార్కట్ పల్లి ఏపీ లింగోటం, పాటు పలు గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం,సిఐటీయు,రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం సిఐటీయు రైతు సంఘం ఆధ్వర్యంలో రేపు మండల జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని ఈ కార్యక్రమంలో కార్మికులు వ్యవసాయ కూలీలు రైతాంగం పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యుడు దండు రవి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దండు నాగరాజు, ఆమనగంటి ఐలయ్య, నన్నేసాబ్, దండు శంకరయ్య, శంకర, శ్రీను, బొల్లెద్దు సైదులు, రజిత, లక్ష్మమ్మ లింగమ్మ, పిచ్చమ్మ కార్మికులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

# ఏపీ రాష్ట్రంలోని 28 జిల్లాలకు బీజేపీ ఇన్‌ఛార్జిల నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్.

అమరావతి : తాజావార్త జూన్ 30:

ఏపీ రాష్ట్రవ్యాప్తంగా నియమించిన బీజేపీ జిల్లా ఇన్‌ఛార్జిల వివరాలు ఇలా ఉన్నాయి.

1.పార్వతీపురం మన్యం– పోలిమేర శ్రీనివాసరావు.
2.అల్లూరి సీతారామరాజు -- పుట్ట గంగయ్య.
3.పోలవరం -- గాదే శ్రీనివాసరావు
4.శ్రీకాకుళం -- రవీందర్ రెడ్డి మేడపాటి
5.విజయనగరం -- ఎన్. విజయానంద రెడ్డి
6.విశాఖపట్నం -- రెడ్డి పావని
7.అనకాపల్లి -- ఏ.పీ.ఆర్. చౌదరి
8.కాకినాడ -- ఆకుల శ్రీధర్
9.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ-- కరంకి శ్రీనివాస్
10.తూర్పు గోదావరి -- బుద్దా లక్ష్మీనారాయణ
11.పశ్చిమ గోదావరి -- శ్రీదేవి రేలంగి
12.ఏలూరు -- రామ్ కుమార్చిలుకూరి
13.కృష్ణా -- భోగిరెడ్డి ఆదిలక్ష్మి
14.ఎన్టీఆర్ -- వెంకట సుబ్బారావు నార్ని (తాతాజీ)
15.గుంటూరు -- వై.వి.ఆర్. మోహన్ (దొరబాబు)
16.పల్నాడు-- తొగంటి శ్రీనివాస్ (జిల్లా ఇన్‌ఛార్జి), అవుల నాగేంద్ర కుమార్ యాదవ్ (జిల్లా కో-ఇన్‌ఛార్జి)
17.బాపట్ల-- గాజుల వెంకయ్య నాయుడు
18.ప్రకాశం -- జి. భరత్ కుమార్
19.మార్కాపురం-- కొక్కెర శ్రీనివాస్ యాదవ్
20.ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు -- చంద్రశేఖర్ భీమినేని
21.తిరుపతి -- పి.వి. కృష్ణారెడ్డి
22.చిత్తూరు -- కె.వి. లక్ష్మీనారాయణ రెడ్డి
23.అన్నమయ్య -- టి.డి. వరప్రసాద్
24.కడప -- కొల్లా చిట్టిబాబు
25.శ్రీ సత్యసాయి-- కునిగిరి నీలకంఠ
26.అనంతపురం-- బెస్త చంద్రప్ప
27.కర్నూలు -- సందిరెడ్డి శ్రీనివాసులు
28.నంద్యాల -- పి.డి. పార్థసారథి (జిల్లా ఇన్‌ఛార్జి), అంబిలి కాశీ విశ్వనాథ్ (జిల్లా కో-ఇన్‌ఛార్జి)

# ఆన్‌లైన్ 1-బీ పేరుతో భూ ఆక్రమణ యత్నం.. బాధితుడి ఆవేదన



అన్నమయ్య జిల్లా, : అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నారిగానిపల్లి పంచాయతీ కమ్మవారిపల్లికి చెందిన టి. గుణశేఖర్ (తండ్రి: గంగాధర్) తన భూమికి సంబంధించిన వివాదంపై మదనపల్లె ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి తన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. స్థానికులు రంగారెడ్డి, నాగరాజు, పురుషోత్తం, శ్రీనివాసులు వారి వద్ద నుంచి సర్వే నెంబర్లు 270-2, 270-8, 270-10లో ఉన్న భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. 2015 సంవత్సరం నుంచి ఆ భూమి తమ ఆధీనంలోనే ఉందని, అయినప్పటికీ పలుమార్లు రెవెన్యూ అధికారులను సంప్రదించినా ఇప్పటి వరకు భూమిని ఆన్‌లైన్‌లో నమోదు (1-బీ) చేయలేదని ఆరోపించారు. అయితే వెంకటరమణ అనే వ్యక్తి తమ భూమిని తన పేరుపై ఆన్‌లైన్ 1-బీ చేసుకుని, ఆ భూమి తనదేనంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని గుణశేఖర్ ఆరోపించారు. రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులను ప్రభావితం చేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, భూమికి సంబంధించిన అసలు రికార్డులను పరిశీలించి తమకు న్యాయం చేయాలని గుణశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు.

# ఉరుము కళాకారులను పరిచయం చేసుకొంటున్న ఎం ఎన్ మూర్తి



ధర్మవరం : : ధర్మవరం డివిజన్ లో పర్యటించిన ఏపీ మాల మహానాడు నూతన కమిటీ సభ్యులు. మరియు హెచ్ ఆర్ సి సి ఐ జిల్లా సభ్యులు చెన్నేకొత్తపల్లి మండలం వేడాపురం గ్రామంలో దాదాపు 20 కుటుంబాలున్న మన ఆత్మీయ కుల బాంధవులు ఉరుము కళాకారులను పరిచయం చేసుకుని ప్రభుత్వం నుండి పెన్షన్ ,వివిధ సంక్షేమ పథకాలకు గుర్తింపు కార్డు లకు కావలసిన ధృవపత్రాలను అందజేయాలనిరా మాల మహానాడు నూతన కమిటీ సభ్యులు తెలియజేసినారు. ఉరుము కళాకారుడైన సత్యనారాయణ మా తాతల కాలము నుండి ఈ కులవృత్తినే నమ్ముకుని చాలీచాలని భక్తుల కానుకలతో కుటుంబ పోషణ కొనసాగిస్తున్నామని తెలియజేసినారు. అదే విధంగా వారితో కలసి మన కమిటీ జిల్లా అధ్యక్షులు ఎం ఎన్ మూర్తి మాట్లాడుతూ మన జాతి ఉరుము కళాకారులకు త్వరలో తప్పకుండా గుర్తింపు కార్డులు పెన్షన్ సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామని త్వరలో మీ (మన) కళాకారులచే జిల్లాలో భారి సమీకరణతో శోభాయాత్ర నిర్వహించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలియజేసినారు. ఈ పర్యటనలో శ్రీ సత్య సాయి జిల్లా పెనుగొండ డివిజన్ హెచ్ ఆర్ సి సి ఐ చైర్మన్ ఏపీ మాల మహానాడు అధ్యక్షులు ఎం.ఎన్ .మూర్తి, హెచ్ ఆర్ సి సి ఐ జిల్లా జాయింట్ సెక్రెటరీ, మాల మహానాడు కోశాధికారి కురుగుంట గోవిందు, హెచ్ ఆర్ సి సి ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ గొల్లపల్లి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్ర స్థాయిలో ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ సమర్థంగా నిర్వహించాలి: భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ



వై ఎస్ ఆర్ కడప, తాజావార్త జూన్ 30: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నవీకరణపై చేపట్టిన సర్వే సమర్థంగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ తెలిపారు. మంగళవారం ఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ....ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేసేందుకు జరుగుతున్న ఇంటింటి ఓటర్ల సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా ప్రత్యేక అధికారి గా నియమితులైన ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ సెక్రటరీ టి.ఎస్. చేతన్,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పాల్గొన్నారు. జిల్లాలో 2252 బీఎల్ఓ లు ఉన్నారని,జిల్లా లో మొత్తం 1896231 ఓటర్లు కలరని, 97.67శాతం ఫారం పంపిణీ ప్రక్రియ జరిగిందని, 21.53శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు డి ఆర్ ఓ మల్లికార్జునుడు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నాం

-జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

-ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఈసీఐ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ



అన్నమయ్య జిల్లా, మదనపల్లి : జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై మంగళవారం భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అధ్యక్షతన... రాష్ట్రంలోని జిల్లాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అమలు, పురోగతి, క్షేత్రస్థాయి చర్యలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవతో కలిసి జిల్లా ఎన్నికల అధికారు(ణజూ)లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు మదనపల్లి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, ఆర్డీఓలు ఏ. శ్రీనివాస్, నారాయణ రెడ్డి, ఎస్‌డీసీ మాధవ కృష్ణారెడ్డి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చేపడుతున్న చర్యలు, క్షేత్రస్థాయి పురోగతి, నమోదు మరియు పరిశీలన కార్యక్రమాలపై జిల్లా వారీగా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో 12,32,439 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 12,00,996 మంది ఓటర్లకు 97.38 శాతం మేర ఎలక్షన్ ఫార్మ్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియలను వేగవంతం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, ఫారంల పంపిణీ, మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియ తదితర అంశాలలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ వివరించారు. ఈ వీసీలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# సమదృష్టి సమన్యాయంతో విశ్వవిద్యాలయ అభివృద్ధి: వైవియు వి.సి. ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

వైస్సార్ కడప తాజావార్త జూన్ 30: సమదృష్టి సమన్యాయం సమతుల్యతతో విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందుతోందని ఇందులో పనిచేసే ప్రతి ఒక్కరు కీలకమేనని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాలలో బోధనేతర సిబ్బంది ఎం. షబ్బర్ అహ్మద్ ( జూనియర్ అసిస్టెంట్, ఎం. చెన్నారెడ్డి (ల్యాబ్ అసిస్టెంట్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీ)పరీక్షల నియంత్రణాధికారి) కె. నరసింహులు, (ఆఫీస్ సబార్డినేట్, అడ్మినిస్ట్రేటివ్ భవనం) తమ పదవీకాలం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా పదవీ విరమణ అభినందన సభ మంగళవారం సాయంత్రం వైవియూలోనే అన్నమాచార్య సెనేట్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ కే గంగయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కెఎస్ వి కృష్ణారావు, బోధన, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.



# నేడు వైఎస్ జగన్ కీలక ప్రెస్‌మీట్.



తాడేపల్లి తాజావార్త జూన్ 30:: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు (బుధవారం) ఉదయం 11 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ ప్రెస్‌మీట్ జరగనుంది.రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు, ప్రజా సమస్యలు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలే అజెండాగా వైఎస్ జగన్ మాట్లాడనున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై ఆయన మాట్లాడే అవకాశం ఉంది

# అవినీతి ఆరోపణల నడుమ.. కొత్తపల్లి విలీనంపై పునరాలోచన చేయాలి - మల్లెల ఝాన్సీ

-అవినీతి ఆరోపణలతో విలీనంపై రాజకీయ దుమారం..

-ప్రభుత్వం ముందు అవినీతి అధికారులపై చర్యలు.. తర్వాతే గ్రామాల విలీనంపై నిర్ణయం తీసుకోవాలని

-మాజీ ఎంపీపీ మల్లెల ఝాన్సీ రాణి డిమాండ్

సలాం ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో ప్రభుత్వ అధికారులపై అవినీతి ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారిన వేళ, కొత్తపల్లి గ్రామపంచాయతీని ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రతిపాదనపై మాజీ ప్రొద్దుటూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు మల్లెల ఝాన్సీ రాణి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో మల్లెల ఝాన్సీ మాట్లాడారు.బుధవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెరిగిపోయిందని చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, వాటిపై ప్రభుత్వం వెంటనే స్పందించి అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయి ప్రభుత్వ శాఖల్లో లంచాలు ఇవ్వకుండా పనులు జరగడం లేదని, అవినీతి నిరోధక వ్యవస్థ పనితీరుపైనా ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేశాయని ఝాన్సీ రాణి పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులను గుర్తించి, వారి వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా విచారించి, సంబంధిత వారిపై కేసులు నమోదు చేయాలని ఆమె కోరారు. గ్రామసభలో కమిషనర్ వ్యాఖ్యలు ప్రస్తావన... ఈ నెల 28న కొత్తపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో మున్సిపల్ కమిషనర్ కూడా అవినీతి అంశాన్ని ప్రస్తావించారని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లో మరింత అనుమానాలకు తావిస్తున్నాయని అన్నారు. అంతేకాకుండా, ఇటీవల రోడ్ల నిర్మాణ నాణ్యతపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేసిన ఆరోపణలను కూడా ఆమె గుర్తు చేశారు. విలీనానికి ముందు పారదర్శక పాలన అవసరం.. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తపల్లి గ్రామపంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేయడం గ్రామ ప్రజల ప్రయోజనాలకు అనుకూలం కాదని ఝాన్సీ రాణి అభిప్రాయపడ్డారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పరిపాలనా వ్యవస్థలో గ్రామాలను విలీనం చేయడం కంటే, ముందుగా ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు పారదర్శక సేవలు అందించే పరిస్థితి ఏర్పడిన తర్వాతే విలీనంపై ముందడుగు వేయాలని సూచించారు. రాజకీయ ప్రయోజనాల కంటే గ్రామ భవిష్యత్తు గురించి ఆలోచించాలి... రాజకీయ ప్రయోజనాల కంటే గ్రామ భవిష్యత్తు ప్రజల ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం దీని పై మరోసారి ఆలోచించాలనీ మల్లెల ఝాన్సీ రాణి అభిప్రాయం వ్యక్తం చేశారు.వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనాల కంటే గ్రామ భవిష్యత్తు, ప్రజల సంక్షేమమే ముఖ్యమన్నారు.గ్రామ అభివృద్ధి, ప్రజల హక్కులు, భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబద్ధత నిరూపించుకోవాలి... మంచి పాలన అందిస్తున్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వం అవినీతి ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా తన నిబద్ధతను నిరూపించుకోవాలని మల్లెల ఝాన్సీ రాణి కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే అవినీతిపై రాజీ లేని వైఖరి అవలంబించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.



# తాళ్లమాపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



సలాం ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు రోటరి కంటి ఆసుపత్రి ,కడప జిల్లా అంధత్వ నివారణ సొసైటి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తాళ్లమాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య పరీక్షా శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తాళ్లమాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్యులు వందలాది మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సలహాలు అందించడంతో పాటు మందులు పంపిణీ చేశారు. పరీక్షల్లో శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన అర్హులైన రోగులకు రోటరి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఆపరేషన్‌కు సంబంధించిన రవాణా, భోజనం, వసతి, మందులు, కంటి అద్దాలు తదితర సౌకర్యాలను కూడా పూర్తిగా ఉచితంగా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరి ట్రస్ట్ ప్రతినిధులు కోరారు. శిబిరం విజయవంతం కావడానికి వైద్య బృందం, స్థానిక నిర్వాహకులు, స్వచ్ఛంద సేవకులు విశేషంగా కృషి చేశారు.

# మున్సిపాలిటీలో విలీనంపై ప్రజల అభిప్రాయాల సేకరణ పూర్తి..

-సోమలవారిపల్లితో ముగిసిన ఐదు గ్రామపంచాయతీల గ్రామసభలు

-అనుకూల--వ్యతిరేక అభిప్రాయాలను నమోదు చేసిన అధికారులు..

-డీపీఓకు సమగ్ర నివేదిక పంపనున్నట్లు ప్రత్యేక అధికారి మంజుల వాణి వెల్లడి

సలాం ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఐదు గ్రామపంచాయతీల విలీన ప్రతిపాదనపై ప్రజల అభిప్రాయాల సేకరణ ప్రక్రియ పూర్తయింది. చివరిదైన సోమలవారిపల్లి గ్రామంలో గురువారం ప్రశాంత వాతావరణంలో గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి అనుకూల, వ్యతిరేక అభిప్రాయాలను సేకరించినట్లు ప్రత్యేక అధికారి మంజుల వాణి తెలిపారు. గ్రామసభ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చౌటపల్లి, దొరసానిపల్లి, సోమలవారిపల్లి, కొత్తపల్లి, గోపవరం గ్రామపంచాయతీలను ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రతిపాదనపై జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు గ్రామాల్లో గ్రామసభలు పూర్తికాగా, సోమలవారిపల్లిలో నిర్వహించిన సమావేశంతో ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ పూర్తయిందన్నారు. గ్రామసభలో మున్సిపాలిటీలో విలీనమైతే కలిగే ప్రయోజనాలు, ఎదురయ్యే సవాళ్లు, అలాగే గ్రామపంచాయతీగా కొనసాగితే ఉండే లాభనష్టాలను అధికారులు ప్రజలకు వివరించారు. గ్రామస్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. విలీనానికి అనుకూలంగా ఉన్నవారి కోసం ఒక రిజిస్టర్, వ్యతిరేకంగా ఉన్నవారి కోసం మరో రిజిస్టర్ ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయాలను సంతకాల రూపంలో నమోదు చేశారు. ఈ అభిప్రాయాలతో పాటు సర్వే వివరాలు, మ్యాపులు, ఇతర రికార్డులను జత చేసి జిల్లా పంచాయతీ అధికారికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు ప్రత్యేక అధికారి మంజుల వాణి తెలిపారు. గ్రామసభ ప్రశాంతంగా నిర్వహించడంలో డీఎల్పీఓ నూర్జహాన్, డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరసింహులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పోలీసు అధికారులు సహకరించినట్లు తెలిపారు. అలాగే సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించిన గ్రామ ప్రజలు, మీడియా ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# గోవా గవర్నర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డా. వి.ఎస్. ముక్తియార్



సలాం ప్రొద్దుటూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షేక్ వెల్ఫేర్ & డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. వి.ఎస్. ముక్తియార్ , రాష్ట్ర రహదారులు & భవనాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారితో కలిసి గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గవర్నర్ వారిని ఆత్మీయంగా పలకరించి, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, సమకాలీన అంశాలు మరియు ప్రజలకు మెరుగైన సేవల అందింపుపై స్నేహపూర్వకంగా చర్చించారు. అనంతరం గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన డా. ముక్తియార్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆప్యాయ వాతావరణంలో సాగగా, పలువురు నాయకులు, అధికారులు కూడా పాల్గొన్నారు.

# భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన డా. వి.ఎస్. ముక్తియార్

-ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న అంతర్జాతీయ విమానాశ్రయం

సలాం ప్రొద్దుటూరు (గజపతినగరం): ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన దిశానిర్దేశం చేయనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఆగస్టు 1న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం నేపథ్యంలో, ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. వి.ఎస్. ముక్తియార్ బుధవారం విమానాశ్రయ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, హెలిప్యాడ్, సభా ప్రాంగణం, వీఐపీ వసతులు, ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలు తదితర అంశాలను అధికారులతో కలిసి సమీక్షించారు. ఏర్పాట్లు ఎలాంటి లోపాలు లేకుండా ఉండేలా అవసరమైన సూచనలు చేశారు. అనంతరం డా. వి.ఎస్. ముక్తియార్ మాట్లాడుతూ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఈ విమానాశ్రయం ద్వారా ప్రాంతీయ పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు విశేష ప్రోత్సాహం లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ప్రారంభం కావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం



చేయడానికి అన్ని శాఖల అధికారులు, సమన్వయకర్తలు అహర్నిశలు కృషి చేస్తున్నారని, ప్రజాప్రతినిధులు కూడా పూర్తి సహకారం అందిస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు.

## రాష్ట్రానికే ఆదర్శంగా 'స్టార్ట్ అప్ కడప' పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్



కడప: : వైఎస్సార్ కడప జిల్లాలో యువతలో ఆవిష్కరణలు, పారిశ్రామిక స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్మిస్తున్న లో"స్టార్ట్ అప్ కడప" ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెంటర్‌లి రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావనతో కలిసి నిర్మాణ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. అత్యాధునిక సదుపాయాలతో నిర్మితమవుతున్న ఈ కేంద్రం ద్వారా స్టార్టప్స్, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తలకు అవసరమైన మౌలిక వసతులు, శిక్షణ, వ్యాపార సలహాలు ఒకే వేదికపై అందనున్నాయని కలెక్టర్ తెలిపారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, నాణ్యతలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## వేతనాలు చెల్లించాలని ఎఐటీయూసీ ధర్నా.. డీఈవోకు వినతిపత్రం



వైఎస్సార్ కడప జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల నైట్ వాచ్‌మెన్‌లకు 8 నెలలు, ఆయాలకు 4 నెలలుగా వేతనాలు అందడం లేదని ఆరోపిస్తూ ఎఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. వెంటనే బకాయి వేతనాలు విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.నెలల తరబడి జీతాలు లేక కుటుంబాల పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రూ.6,000 వేతనం కూడా సకాలంలో అందడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల వేదికలో డీఈవో షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు.

## సెకండరి హెల్త్ పరిధిలో ఉద్యోగ అవకాశాలు

కడప: : వై యస్ ఆర్ కడప జిల్లా డైరెక్టర్ ఆఫ్ సెకండరి హెల్త్ పరిధిలోని ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న **Theatre Assistant (02) and General Duty Attender/MNO/FNO (09)** పోస్టులు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగ నియామకములు జరుపుటకు వైయస్ ఆర్ కడప జిల్లా కలెక్టర్, వై యస్ ఆర్ కడప వారు ఆదేశించియున్నారని డిసిహెచ్ఎస్,జిల్లా కో ఆర్డినేటర్ డా. వై హిమ దేవి నేడొక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను పూరించి అర్హత సర్టిఫికెట్లు జతపరచి తేది. 28.07.2026 నుండి 04.08.2026 లోపు జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి, డైరెక్టర్ ఆఫ్ సెకండరి హెల్త్, కలెక్టర్ ఆఫీసు, 'ఓ' బ్లాక్, వై యస్ ఆర్ కడప జిల్లా వారి కార్యాలయము, నందు వ్యక్తిగతముగా హాజరై సమర్పించవలెను. పూర్తి వివరములు జిల్లా **website https://kadapa.ap.gov.in/** నందు పొందుపరచబడినది.

## సైబర్ నేరాలు, దొంగతనాలపై బోయనపల్లిలో అవగాహన సదస్సు

-మన్నూరు సీఐ లింగప్ప



రాజంపేట : జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు మన్నూరు పి.ఎస్ పరిధి బోయనపల్లి గ్రామంలో సైబర్ నేరాలు మరియు ఇళ్ల దొంగతనాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మన్నూరు సీఐ ఎస్. లింగప్ప, ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు హాజరై గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు పంపే ఫోన్ కాల్స్, లింకులు, గ్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు.వివాహాలు, శుభకార్యాలు మరియు ఊరెళ్లే సమయాల్లో ఇళ్ల వద్ద డబ్బు, బంగారు ఆభరణాలు భద్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇంటి తాళాలు బాగా వేయడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు.ఈ సదస్సులో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు

## ఫిర్యాదులను నిర్ణీత గడువులో చట్టపరిధిలో పరిష్కరించాలి: కడప ఎస్పీ నచికేత్ షెల్కే



కడప: వైఎస్సార్ కడప జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ పాల్గొని ప్రజల నుంచి 130 ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్న ఆయన, చట్టపరిధిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.అందిన ప్రతి ఫిర్యాదును అత్యధిక ప్రాధాన్యతతో నిర్ణీత గడువులో పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశించారు. పోలీస్ శాఖ పరిధిలోని సమస్యలను ప్రజలు నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. సుధాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ప్రజలకు హెచ్చరిక..రోడ్డుపై మురికినీరు వదిలితే రూ.15వేలు ఫైన్




హైదరాబాద్ : హైదరాబాద్ సిటీ పరిశుభ్రతపై జలమండలి దృష్టి సారించింది. రోడ్లపై మురికినీరు వదిలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. సిటీలోని పలుచోట్ల మురుగు నీరు రోడ్లపై వదలడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదుల రావడంతో ఈ చర్యలకు దిగింది.రూల్స్ ఉల్లంఘించినవారిపై రూ. 15 వేల జరిమానా తప్పదని వార్నింగ్ ఇచ్చింది. సోమవారం (జూలై27) సిటీ పరిధిలోని బంజారాహిల్స్ లో మురికి నీరు వీధుల్లో వదిలి ప్రజలకు అసౌకర్యం కలిగించిన బిషారావు బ్రైడల్ వేర్ సంస్థకు రూ.15వేల జరిమానా విధించింది. సంస్థలో ఉన్న సంపు శుభ్రం చేసి మురుగునీటిని వీధుల్లో వదలడంతో దుర్వాసనతో , బురదతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంపై పలువురు స్థానికులు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తనిఖీలు చేపట్టిన జలమండలి అధికారులు..ఘటనా స్థలంలో డీవాటరింగ్ సబ్ మెర్సిబుల్ పంపు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు పాటించాలని సంస్థ ప్రతినిధులకు జలమండలి హెచ్చరించింది.

## టీ. ముస్తాపురంలో ఇంటింటికి ప్రచారంలో మంత్రి ఆనం

-రూ 34 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్లు , డ్రైన్లకు ప్రారంభం



ఆత్మకూరు: : కూటమి ప్రభుత్వం రెండు వేల పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించి ఇంటింటికి కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు కార్యక్రమాని ఆత్మకూరు టీ. ముస్తాపురం గ్రామంలో విశేష స్పందన లభించింది. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని టీ. ముస్తాపురం దళితవాడలో ఇంటింటికి ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. మంత్రి ఆనం ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకొని రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. మంత్రి ఆనంతో పాటు ఆయన కుమార్తె ఆనం లీలా కైవల్యా రెడ్డి , టీడీపి సీనియర్ నాయకులు తాళ్లూరి గిరి నాయుడు, కూటమి నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అనంతరం రూ 34 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్లు , డ్రైన్లకు మంత్రి ఆనం ప్రారంభించారు అనంతరం రచ్చబండ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి 'ఇంటింటికి కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు' కార్యక్రమం రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 45 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు..ఈ కార్యక్రమంలో టీడీపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, టీడీపి రూరల్ మండలం అధ్యక్షులు సుంకర పెంచలయ్య చౌదరి, ముస్తాపురం ఒకటో వార్డు అధ్యక్షులు కోయి నరేష్ కేతా విజయభాస్కర్ రెడ్డి , ఏఎంసి చైర్మన్ ఆరికట్ల జనార్దన్ నాయుడు , వైస్ చైర్మన్ బిజిరెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజా రెడ్డి , మాజీ కౌన్సిలర్లు సూరా భాస్కర్ రెడ్డి, కొప్పోలు రమాదేవి , ఎం. రాజశేఖర్, పొదమేకల పెంచలయ్య, దావా పెంచలరావు , సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ పరిటాల సత్యం , హరికృష్ణ, మెంటా శ్రీనివాసులు , బాలకొండయ్య , దాసరి మధు , వెంకట సుబ్బయ్య నాయుడు , తదితరులు ఉన్నారు.

## జూనియర్ ఎన్టీఆర్‌కు గాయం..



హైదరాబాద్ : ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌కు గాయమైంది. ఈరోజు(సోమవారం, జూలై 27వ తేదీ) సాయంత్రం జూ. ఎన్టీఆర్ భుజానికి గాయమైనట్లు ఎన్టీఆర్ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది.ఈ విషయాన్ని అధికారికంగా తెలియజేసిన ఎన్టీఆర్ కార్యాలయం.. డా. జె. మధుసూదన్ రావు మరియు డా. ఆర్. ఏ. పూర్ణచంద్ర తేజస్వి నేతృత్వంలోని వైద్యుల బృందం పర్యవేక్షణలో చికిత్స జరుగుతున్నట్లు తెలిపింది.ఎన్టీఆర్ పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించినట్లు స్పష్టం చేసింది. అభిమానులు, శ్రేయోభిలాషులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేసింది. ఎన్టీఆర్ ఆరోగ్యం, కోలుకునే ప్రక్రియకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని తగిన సమయంలో ఎప్పటికప్పుడు అందిస్తామని ఎన్టీఆర్ టీమ్ పేర్కొంది.

## మదనపల్లి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బుచ్చిరాజు.



మదనపల్లి ..మదనపల్లి సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా ఎం.బుచ్చిరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెయిటింగ్ లో ఉన్న ఆయనను ప్రభుత్వం ఇక్కడకు నియమించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.నూతన డీఎస్పీకి ఎస్పీ శుభాకాంక్షలు తెలుపుతూ.. విధి నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలకు తక్షణమే స్పందించాలని ఆదేశించారు.ప్రధానంగా మహిళల భద్రత, సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించి పారదర్శకంగా పని చేయాలని సూచించారు.

## ప్రజావాణి లో మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఫిర్యాదు

– సీతారాంపూర్ 23వ డివిజన్ సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి



కరీంనగర్ : సీతారాంపూర్ 23వ డివిజన్ లో రూ.49 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై, టెండర్ ప్రక్రియ పూర్తై కాంట్రాక్టర్ తో అగ్రిమెంట్ జరిగినప్పటికీ, మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత ఫైల్ మిస్ అవ్వడం తో రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో రోడ్డును తవ్వి వదిలేయడం కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ, కిందపడి గాయాల పాలవుతున్నారు. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పాదం అజంత గారు, సంస్థ తరఫున తన లెటర్‌ప్యాడ్ పై వినతిపత్రం సిద్ధం చేసి, ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గారికి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గారు సంబంధిత అధికారులకు వెంటనే విచారణ నిర్వహించి, సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పాదం అజంత గారు మాట్లాడుతూ, మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా అది తమ దృష్టికి వచ్చిన వెంటనే తమ వంతు సహాయ సహకారాలు అందించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు.. కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు



రెండు రోజుల క్రితం 'బిహార్ బంద్' సందర్భంగా శివాన్ జిల్లాలో విద్యార్థులపై పోలీసు కానిస్టేబుల్ ఏకే-47తో కాల్పులు జరిపిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్ అవ్వడంతో ఉన్నతాధికారులు సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఈనెల 25న జరిగిన బంద్ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో 15 ఏళ్ల మహమ్మద్ ఆరిఫ్ కూడా ఉన్నాడు. ప్రతిపక్ష నేతలు తేజస్వి యాదవ్, రాహుల్ గాంధీలు ఈ ఘటనపై స్పందించి, ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు.

# నూతన డిఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన బివి జగన్నాథ రాజు.



ధర్మవరం : పట్టణంలోని డిఎస్పీ కార్యాలయంలో గత కొన్ని నెలలుగా డి.ఎస్.పి లేకపోవడంతో ఇంచార్జ్ వ్యవస్థ కొనసాగింది. ఎట్టకేలకు ప్రభుత్వం నూతన ధర్మవరం డిఎస్పీగా బి.వి. జగన్నాథరాజును ధర్మవరం డిఎస్పీగా బదిలీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పి సోమవారం డి.ఎస్. పి కార్యాలయంలో పదవీ బాధ్యతలను చేపట్టారు. వీరు వైజాగ్ రేంజ్ సిఐ గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతి పై ధర్మవరం డిఎస్పీగా రావడం జరిగింది. అనంతరం వారు జిల్లా ఎస్పీను గౌరవపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ధర్మవరం డివిజన్ పరిధిలోని ప్రజలకు అందరికీ అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించే దిశగా తాను కృషి చేస్తానని వారు తెలిపారు. తదుపరి పలువురు సిఐలు, ఎస్సైలు, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది కలిసి నూతన డిఎస్పి కి పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజల గడపకు సంక్షేమం అదే ముఖ్యమంత్రి ధ్యేయం :ముక్కా రూపనంద రెడ్డి



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు : ప్రజలకు ప్రతిగడపకు సంక్షేమ పథకాలు అందించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ధ్యేయంగా పనిచేస్తున్నారని రైల్వేకోడూరు టీడీపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి అన్నారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ తుంగ వాండ్ల పల్లెలో గడపగడపకు సంక్షేమం అనే పథకాన్ని ప్రజల్లో కరపత్రాలతో సంబంధిత పార్టీ శ్రేణులతో ముక్కారూపానంద రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టి రెండేళ్ల నమ్మకం – సంక్షేమం, అభివృద్ధి ఇంటింటి ప్రచార కార్యక్రమాలలో భాగంగా ఆయన పాల్గొంటూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీని నిర్వహించారు. ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు చేపట్టినా అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేస్తున్నామని వారు తెలియజేశారు. ప్రజల అభిప్రాయాలు, స్థానిక సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు . రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ప్రజల నమ్మకం పెట్టుకున్న కూటమి ప్రభుత్వం నిరంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలు మహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంత అవసరమని ప్రజలు సూచనలు ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరాజుపేటకు చెందిన టీడీపి యువ నాయకులు అకేపాటి సుకుమార్ రెడ్డి, మాజీ టీడీపి అధ్యక్షులు పందేటి వెంకటరామరాజు, శేఖర్ రాజు తో పాటు కూటమికి చెందిన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు: సీఎం చంద్రబాబు.

అమరావతి : భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చినట్లు అవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలో భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంపై ఏపీ సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 1వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయం ప్రారంభం అవుతుందని తెలిపారు. 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,727 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు వివరించారు. ఈ విమానాశ్రయంలో 3,800 మీటర్ల రన్‌వే ఉందని గుర్తు చేశారు. తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యం ఈ విమానాశ్రయం కలిగి ఉందన్నారు. 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు.ఆగస్టు 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే భద్రత, ట్రాఫిక్, అతిథుల స్వాగత ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. ప్రతి శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు

# భారీ వర్షం.. ఉద్యోగులకు ముందస్తు లాగౌట్: ట్రాఫిక్ పోలీస్



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక అడ్వైజరీ జారీ చేశారు.తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖకు చెందిన సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్-1) కార్యాలయం ఈ అధికారిక సూచనలు విడుదల చేసింది. సాయంత్రం వేళల్లో భారీ ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా చూడటంతో పాటు అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ నగరంలో ఈ రోజు (జూలై 27, 2026న) మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించిన నేపథ్యంలో, ముఖ్యంగా ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేశారు. ఉద్యోగులు ఒకేసారి కార్యాలయాల నుంచి బయటకు రావడం వల్ల ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ స్తంభించే పరిస్థితి ఏర్పడవచ్చని పేర్కొన్నారు

# మా సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటాలు ఆపము.. దస్తావేజు లేఖరులు.



ధర్మవరం : మా సమస్యలు పరిష్కరించేంతవరకు మా పోరాటాలు ఆపము అని దస్తావేజు లేఖలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై నెల 20వ తారీకు నుండి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరులు తలపెట్టిన పెన్ డౌన్ కార్యక్రమం ఎనిమిదో రోజు చేరుకుంది. ఇందులో భాగంగా పుట్టపర్తి లోని కలెక్టర్ కార్యాలయానికి దస్తావేజులేఖర్లతో కలసి వెళ్లి జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలని తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్కు అందజేయడం జరిగిందన్నారు. మన సమస్యలు పరిష్కారమే ఇంతవరకు ఐక్యమత్యంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దస్తావేజులేఖర్ల సంఘం అధ్యక్షులు జావిద్, ఉపాధ్యక్షులు భాస్కర్, సెక్రెటరీ మహేంద్ర, జాయింట్ సెక్రెటరీ నాగార్జున, సభ్యులు సుధాకర్, ధను, గోపి, వెంకటేష్, రామాంజనేయులు, కీర్తి ,తదితర దస్తావేజులేఖరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టంభనకు తెర- నేడే కీలక బిల్లుపై చర్చకు అధికార, విపక్షాలు..!



ఢిల్లీ : నీట్ సహా పలు జాతీయ స్థాయి పరీక్షల్లో అక్రమాల నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు కేంద్రం పలు చర్యలు చేపట్టింది. ఇందులో ప్రభుత్వ పరీక్షల నిర్వహణ బిల్లులో కీలక సవరణలు చేసిందిఅయితే ఈ బిల్లుపై చర్చకు ఇవాళ పార్లమెంట్ లో అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సభా కార్యకలాపాలు స్తంభించిపోయాయి. అధికార, విపక్షాలు ఏకాభిప్రాయానికి రావాలని స్పీకర్ కోరినా అంగీకరించకపోవడంతో లోక్ సభ **(Lok Sabha)**లో ప్రతిష్టంభన కొనసాగింది. ఈ నేపథ్యంలో తెరవెనుక అధికార, విపక్షాలు ఇవాళ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది.స్పీకర్ ఓం బిర్లా సూచన మేరకు ఈ కీలకమైన బిల్లులో విపక్షాలు సూచిస్తున్న సవరణలకు అధికార ఎన్డీయే అంగీకారం తెలిపినట్లు సమాచారం. దీంతో నేడు మంగళవారం లోక్ సభలో ఈ బిల్లుపై చర్చ జరగబోతోంది. ఇందులో ఇండియా కూటమి తరఫున విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీతో పాటు ఇతర ఎంపీలు, అలాగే అధికార ఎన్డీయే నుంచి మంత్రులు మాట్లాడబోతున్నారు. అనంతరం ప్రధాని మోదీ సమాధానం ఇవ్వబోతున్నారు.ఈ బిల్లుపై జరిగే చర్చలో కాంగ్రెస్ పాల్గొంటుందని ఆ పార్టీ నేతలు తెలిపారు. లోక్‌సభలో 'పబ్లిక్ పరీక్షల (అక్రమ మార్గాల నివారణ) సవరణ బిల్లు, 2026'పై చర్చకు మొత్తం 8 గంటల సమయం కేటాయించారు. అయితే, ప్రతిపక్షాల తుది వ్యూహం మాత్రం మంగళవారం ఉదయం పార్లమెంటులో జరిగే ప్రతిపక్ష సభాపక్ష నాయకుల సమావేశంలో ఖరారు కానుంది. అనంతరం ఈ బిల్లుపై లోక్ సభలో ముందుగా చర్చ ప్రారంభం కానుంది. లోక్ సభలో బిల్లు ఆమోదం తర్వాత ఎల్లుండి రాజ్యసభలో ప్రవేశపెట్టి ఆమోదించే అవకాశం ఉంది

# మాదక ద్రవ్యాల రహిత భారత నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి: జేసీ నిధి మీనా

కడప : వైఎస్సార్ జిల్లా కడపలో "నషా ముక్త్ యువ -- వికసిత్ భారత్" కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. జూలై 31న యోగి వేమన విశ్వవిద్యాలయంలో ప్రతిజ్ఞ, క్విజ్, సంగీతం, నృత్యం, వీధి నాటకం, కవిత్వం, వక్తృత్వం, నినాద రచన, చిత్రలేఖనం తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువత పోస్టర్‌లోని క్యూ ఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకుని పాల్గొనాలని సూచించాం.



# మేడ్చల్ జిల్లా మానవ హక్కుల సభ్యులతో రాష్ట్ర హ్యూమన్ రైట్స్ చైర్మన్ డా . కిశోర్ కుమార్ భేటీ



మేడ్చల్ : రాష్ట్ర మానవ హక్కుల పరిరక్షణ సంస్థ **(Human Rights)** చైర్మన్ డా . కిశోర్ కుమార్ ఈరోజు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మానవ హక్కుల ప్రతినిధులు, సభ్యులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ?ఈ భేటీలో చైర్మన్ డా . కిశోర్ కుమార్ సభ్యులతో పలు సాధారణ అంశాలు మరియు స్థానిక విషయాలపై ఆప్యాయంగా మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణ, ప్రజల్లో అవగాహన పెంచడం మరియు సమాజంలో బాధితులకు అండగా నిలవడం వంటి అంశాలపై వారు చర్చించారు. ?ఈ సందర్భంగా మానవ హక్కుల సభ్యులు చైర్మన్ కిశోర్ కుమార్ ని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారందరూ కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఈ సమావేశంలో జిల్లా చైర్మన్ రమేష్, జిల్లా సెక్రటరీ పరమేష్, జిల్లా మహిళా చైర్పర్సన్ నాగ జ్యోతి, సెక్రటరీ బాబు రావ్ సభ్యులు పాల్గొన్నారు.

# ట్రంప్ కు ఇరాన్ ఝలక్- యుద్ధం ఆపేశాక ఇదే తొలిసారి..!



ఇంటర్నెట్ డెస్క్ : ఇరాన్ పై అమెరికా ప్రారంభించిన యుద్ధం తాజాగా ముగిసిపోయినట్లే కనిపించి తిరిగి ప్రారంభమైంది. అయితే మళ్లీ అకస్మాత్తుగా నిలిచిపోయింది. దీంతో ఈ రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే ఉన్నట్లుండి యుద్ధాన్ని ఆపేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇరాన్ తో చర్చలు (ఖా-×తిఖఆ ఖశ్రీఎం) జరుగుతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. కానీ ట్రంప్ వాదనను ఇరాన్ ఇవాళ తోసిపుచ్చింది. అంతే కాదు ఇలాంటి చర్చలు జరపడం తమ డీఎన్ఏలోనే లేదని తేల్చిచెప్పేసింది. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరుగుతున్నాయన్న ట్రంప్ వాదనను టెహ్రాన్ ఇవాళ ఖండించింది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఎలాంటి చర్చలు జరగడం లేదని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆ దేశం అమెరికాతో ఎలాంటి చర్చలలో పాల్గొనడం లేదని, చర్చలను పునఃప్రారంభించాలని టెహ్రాన్ కోరిందన్న ట్రంప్ వాదన కూడా కరెక్ట్ కాదని తేల్చేసింది. అలా చేయడం తమ నైజం కాదని తెలిపింది. దానికి బదులుగా చర్చలను కోరింది అమెరికాయేనని ఇరాన్ విదేశీ మంత్రిత్వ శాఖ తెలిపినట్లు తస్నీమ్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది.హార్ముజ్ జలసంధిలో పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని, ఆ వ్యూహాత్మక జలమార్గం అన్ని వర్గాలకు పూర్తిగా మూసేసినట్లు ఇరాన్ విదేశీ మంత్రిత్వ శాఖ మరోసారి తెలిపింది. అలాగే ఎలాంటి చర్చలూ జరగడం లేదని తెలిపింది. ఇరాన్, అమెరికా మధ్య సైనిక ఘర్షణకు తాజాగా విరామం ఇచ్చినప్పటికీ దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్నాయని డొనాల్డ్ ట్రంప్ చెప్పుకొచ్చారు. దీనిపై ఇరాన్ స్పందిస్తూ.. ప్రస్తుతం ఎలాంటి చర్చలు జరగడం లేదని వెల్లడించింది. దీంతో ఇరాన్-అమెరికా మధ్య యుద్ధం నిలిచినా చర్చలు జరగడం లేదని తేలిపోయింది. మరి ఇది వ్యూహాత్మక విరామమా లేగ యుద్ధ వ్యూహమా అన్నది తేలాల్సి ఉంది.

# విపక్షాలపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఫైర్.



ఢిల్లీ : విపక్ష పార్టీలపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. విపక్షాలు ఉభయ సభలను అడ్డుకుంటున్నాయని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పినా విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. లీకేజీల నిరోధానికి...లీకేజీల నిరోధానికి చరిత్రాత్మక బిల్లు తెచ్చామని కిరణ్ రిజిజు తెలిపారు. పరీక్షల బిల్లుపై చర్చకు సహకరించాలన్న కిరణ్ రిజిజు పేపర్ లీక్‌లపై కఠిన చట్టాలు తీసుకొచ్చామని తెలిపారు. సభను అడ్డుకుంటూ విలువైన సమయాన్ని వృధా చేయకుండా సహకరించాలని విపక్షాలను కిరణ్ రిజిజు కోరారు.

## చారు మజుందార్ ఆశయాలతో ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేయాలి... సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు..



ధర్మవరం : భారత కమ్యూనిస్టు ఉద్యమంలో చిరస్మరణీయ నాయకుడు, సిపిఐ(యమ్ యల్) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చారు మజుందార్ 54వ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రోజున స్థానిక పట్టణంలో సిపిఐ(యమ్ యల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ చారు మజుందార్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తూ సిపిఐ యమ్ యల్ లిబరేషన్ పార్టీ ఉమ్మడి అనంతపురం కార్యదర్శి వేమన మాట్లాడుతూ... కామ్రేడ్ చారు మజుందార్ భారతదేశంలోని పేదలు, రైతులు, కూలీలు, అణగారిన వర్గాల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన విప్లవ నాయకుడని పేర్కొన్నారు,ఆయన చూపిన పోరాట మార్గం, చారిత్రాత్మక నక్సల్బరి రైతాంగ తిరుగుబాటు, సిపిఐ(యమ్ యల్) నిర్మించిన విప్లవ సంప్రదాయం నేటికీ సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడుతున్న తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు,దేశంలో కార్పొరేట్ అనుకూల విధానాలు, రైతు--కార్మిక--విద్యార్థి--యువత సమస్యలు, పెరుగుతున్న అసమానతలు మరియు ప్రజాస్వామ్య హక్కులపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు ప్రజలను సంఘటితం చేయడం నేటి అత్యవసర కర్తవ్యమని పేర్కొన్నారు, చారు మజుందార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు,అనంతరం పార్టీ డివిజన్ కార్యదర్శి పోలా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... చేనేతకు ప్రసిద్ధిగాంచిన ధర్మవరం పట్టణంలో నేడు చేనేత కార్మికులు ఆకలి చావులు ఆత్మహత్యల బారిన పడుతున్నారని,చేనేత రక్షణకు ప్రభుత్వాలు తీసుకోవలసిన చర్యలు ఏమాత్రం తీసుకోవడం లేదని , చేనేత కార్మికులు నేడు ఉపాధి భద్రత ,కనీస వేతనాలు ,వంటి ప్రధాన సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు,చేనేత కార్మికులు కుటుంబం మొత్తం రోజంతా కలిసి కష్టపడి శ్రమ చేసిన రోజుకు 400 రూపాయలు కూడా గిట్టుబాటు కావడం లేదని వాపోయారు,ఎన్నికల సందర్భంగా చేనేతలకు కూటమి ప్రభుత్వం నేతన్న భరోసా 25 వేల రూపాయలను అమలు చేస్తామని చెప్పి నేటికీ రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు,అదేవిధంగా చేనేత కార్మికులే కాకుండా ఈ చేనేత వృత్తిపై ఆధారపడి పని చేస్తున్న అనుబంధ రంగాల కార్మికులు కూడా నేడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,వారికి ఏమాత్రం సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని,పట్టు డీలర్లకు సంబంధించి వారికి ఇన్సెంటివ్, విద్యుత్తు రాయితీలు కానీ,వారు పని చేసుకోవడానికి వర్క్ షెడ్ల ఏర్పాటుకు స్థలాలు ఏ మాత్రం కేటాయించలేదని తెలిపారు,భవిష్యత్తులో సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ పార్టీ ధర్మవరంలో ఉన్నటువంటి స్థానిక సమస్యల పైన ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్ ఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వలి,పరశురాముడు,శివకుమార్,నీలం శివప్రసాద్,సిరివెళ్ల దేవేంద్ర,బండి వెంకటరమణ , శ్రీనివాస్ రెడ్డి, గోవిందరాజులు, సుబ్రమణ్యం,మహబూబ్ బాషా,ఇంతియాజ్ సుజాతమ్మ,రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్..



ధర్మవరం : ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ధర్మవరం తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్.. ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున దుర్గా నగర్ కాలనీలోని శ్రీరాముల వారి ఆలయం వద్ద శ్రీరామ్ కు స్థానిక నాయకులు, కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు,నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్తూ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు, కరపత్రాలు అందజేస్తూ.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకుంటూ ముందుకు సాగారు,దుర్గానగర్ లో ఎక్కువగా విద్యుత్ తీగలు కిందివరకు ఉన్నాయని స్థానికులు శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు,వెంటనే ఆయన విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సుమారు 20ఏళ్ల క్రితం వేసిన పోల్స్ ఉండటం వలన అవి దెబ్బతినడం, విద్యుత్ తీగలు కిందకు రావడం వంటివి జరుగుతున్నాయన్నారు, ఈ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ..రెండేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని,గత ఐదేళ్లలో ఎదుర్కొన్న ఇబ్బందులను కూడా ప్రజలు ప్రస్తావిస్తున్నారన్నారని,గత ప్రభుత్వంలో అడుగుకో గుంత కనిపించేదని 10 నిమిషాల ప్రయాణానికి గంట సమయం పట్టేదన్నారు,ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో రోడ్ల మరమ్మత్తు చేయడం, కొత్త రోడ్లు వేయడం వంటివి చేశామన్నారు,దీనిపై ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తూ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నారన్నారని దీని వలన నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తున్నాయని,ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగయ్యాయన్నారు,ఇలాంటి అనేక అంశాలను ప్రజలకు వివరిస్తూ.. ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్తున్నారన్నారు. ఇంకా 43రోజుల పాటు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను కూడా పరిష్కరించే విధంగా ముందుకు సాగుతామని శ్రీరామ్ తెలిపారు...

## పార్లమెంట్‌లో కీలక చట్టం.. సైబర్ నేరాలకు మరణశిక్ష..



ఢిల్లీ / మయన్మార్ : మయన్మార్ పార్లమెంట్ ఆన్‌లైన్ స్కామ్ మోసాలపై ఉక్కుపాదం మోపేందుకు మంగళవారం ఒక నూతన చట్టాన్ని ఆమోదించింది. ఈ 'యాంటీ ఆన్‌లైన్ స్కామ్ బిల్లు' ప్రకారం..సైబర్ స్కామ్ సెంటర్లలో ప్రజలను అక్రమంగా బంధించినా, హింసించినా లేదా బలవంతంగా పనిచేయించినా మరణశిక్ష లేదా జీవిత ఖైదు విధించేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. రాజధాని నేపిడాలో ఉభయ సభల సంయుక్త సమావేశంలో ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదముద్ర వేసినట్లు స్పీకర్ ఆంగ్ లిన్ ద్వే తెలిపారు. సహాయం పేరుతో లేదా ఉద్యోగాల ఆశ చూపి మనుషులను ట్రాఫికింగ్ చేసి, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా తీవ్రంగా వేధించే వారికి ఈ శిక్షలు వర్తిస్తాయి. బాధితులను కిడ్నాప్ చేసి లేదా అక్రమంగా బంధించి క్రూరంగా ప్రవర్తించడం వల్ల వారు మరణిస్తే, నిందితులకు ఖచ్చితంగా మరణశిక్షే విధించబడుతుంది. అలాగే డిజిటల్ కరెన్సీ (క్రిప్టో) స్కామ్‌లు నడిపే వారికి, సైబర్ క్రైమ్ కేంద్రాలను నిర్వహించే ముఠా నాయకులకు గరిష్ఠంగా జీవిత ఖైదు పడేలా ఈ చట్టంలో స్పష్టమైన ప్రొవిజన్లు ఉన్నాయి.

## ఫిట్నెస్, సరైన పత్రాలు లేకుండా ముగ్గురాయి తరలిస్తున్న లారీలు

-ప్రమాదాలు జరిగితే ఎవరిది బాధ్యత...?



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు : మంగంపేట ఏపీఎండీసీ నుండి ముగ్గురాయి కొనుగోలు చేసి ఎక్స్పోర్ట్ కంపెనీలకు తరలించే వాహనాలకు సరైన పత్రాలు, ఫిట్నెస్ లేకుండా తరలిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎండీసీ సంస్థ నుండి ముగ్గురాయి కొనుగోలు చేసి పెద్ద కంపెనీలకు, ఎగుమతిదారు కంపెనీలకు ముగ్గురాయిని సుమారు 350 వాహనాలు తరలిస్తున్నాయి. వాటి లో దాదాపు 170 వాహనాలకు ఆర్.సి, ఫిట్నెస్ సర్టిఫికెట్ , పర్మిట్, పొల్యూషన్, ట్రాన్స్పోర్ట్ అనుమతి, ఇన్సూరెన్స్ వంటి లేకుండా లారీలు లోడింగ్ కు వస్తున్నాయని తెలిపారు. గత మూడు రోజుల క్రితం నుండి ఏపీఎండిసి సిపిఓ గోపీనాథ్, ఫిట్నెస్ చెకింగ్ అధికారులు ముగ్గురాయి తరలించే అన్నిరకాల అనుమతి పత్రాలు ఉంటేనే లోడింగ్ కు అనుమతిస్తామని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది. కుటుంబ బ్రతుకు దెరువు కోసం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వాహనదారులు ఒకటిరెండు లారీలను ఏర్పాటు చేసుకోగా, లిమిటెడ్ కంపెనీలకు చెందిన ట్రాన్స్పోర్ట్ వ్యాపారాలు నిర్వహించేవారు పదుల సంఖ్యలో వాహనాలు నడుపుతున్నప్పటికీ సరైన పత్రాలు లేకపోవడం మంగంపేటలో తీవ్రమైన ప్రజల్లో విమర్శ నిరూపణంగా తయారయింది. ఏపీఎండీసీ సంస్థ నిబంధనలు , రోడ్డు భద్రత నియమాల ప్రకారం యాజమాన్యాలు నడుచుకోవాలని చెబుతున్నప్పటికీ కొంతమంది అదృశ్య శక్తులుగా మారి సంస్థ అధికారులపై కూటమి ప్రభుత్వంలో ఉన్న రాజకీయ నాయకుల ఒత్తిళ్లు తీసుకువచ్చి వాహనాలకు అనుమతులు ఇవ్వాలని చెబుతున్నారని బాహాటంగా విమర్శిస్తున్నారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగితే వాహన డ్రైవర్లు ప్రమాదం బారిన పడిన కుటుంబాలకు ఎవరు న్యాయం చేస్తారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లిమిటెడ్ కంపెనీ యాజమాన్యాలతో అటు ఆర్టీవో ఇటు ఏపీఎండిసి యాజమాన్యం కుమ్మక్కై మామూళ్ల మత్తులో కూరుకుపోయి ఫిట్నెస్ లేని బండ్లను ఏపీఎండిసి సంస్థలో లోడింగ్ ఇస్తున్నారని ప్రజలలో బహిరంగంగా విమర్శలు వస్తున్నాయన్నారు, వీళ్ల వల్ల ఫిట్నెస్ లేని వాహనాల డ్రైవర్లకు ప్రమాదాలు ఏదైనా జరిగితే పూర్తి బాధ్యత ఏపీఎండిసి యాజమాన్యం భరించాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు

## మేమూ బాధితులమే' క్రిమినల్ కేసుపై తమ్మినేని సీతారాం రియాక్షన్.



శ్రీకాకుళం : శ్రీకాకుళంలో జరిగిన ఒక భూమి కొనుగోలు వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు తమ్మినేని సీతారాం తనపై క్రిమినల్ కేసు నమోదు కావడంపై స్పందించారు. తాను ఎప్పుడూ చట్టాన్ని ఉల్లంఘించలేదని.. మధ్యవర్తులను నమ్మి మోసపోయామని, ఈ వ్యవహారంలో తామూ బాధితులమే అంటూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తులు చూయించిన పత్రాలను నమ్మే ఆ భూమిని కొనుగోలు చేశామని.. భూ కొనుగోలులో తాను ఎలాంటి అక్రమ మార్గాలను అనుసరించలేదని తమ్మినేని చెప్పారు. ఒక సామాన్యుడిలాగే తాము కూడా పత్రాలను పరిశీలించే కొనుగోలు ప్రక్రియ చేపట్టామన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అన్ని పత్రాలను సమర్పించామని, అధికారులు వాటిని పరిశీలించిన తర్వాతే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని తమ్మినేని సీతారాం వివరించారు. తాను కొనుగోలు చేసిన భూమి వివాదంలో ఉందని తెలుసుకుని ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా తాము సివిల్ కోర్టును ఆశ్రయించామని తెలిపారు. ఏడాదిన్నర కాలంగా ఆ కేసు సివిల్ కోర్టులో విచారణలో ఉందని.. న్యాయపరంగా తేల్చుకోవడానికే తామూ కోర్టుకు వెళ్లినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఒకవైపు సివిల్ కోర్టులో విచారణ జరుగుతుండగా.. అదే అంశంపై ఇప్పుడు క్రిమినల్ కేసు నమోదు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందని చెప్పారు. ఈ భూ వ్యవహారంలో తాము కూడా బాధితులేమనని.. మధ్యవర్తులను నమ్మి మోసపోయామంటూ తేల్చి చెప్పారు. పోలీసు దర్యాప్తునకు తాము పూర్తిగా సహకరిస్తామని, చట్టంపై తమకు పూర్తి గౌరవం ఉందని చెప్పారు. దర్యాప్తునకు అవసరమైన అన్ని పత్రాలను అధికారులకు సమర్పిస్తామని, తమ వాదనను కోర్టు ముందు ఉంచుతామని చెప్పారు. ఈ కేసు వ్యవహారంలో తమ్మినేని సీతారాం మీడియాకు కూడా ఓ విజ్ఞప్తి చేశారు. కేసు దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున వాస్తవాలు పూర్తిగా తేలకముందే మీడియా తొందరపడి తీర్పులు ఇవ్వొద్దని కోరారు. రాజకీయ దురుద్దేశాలతో ప్రచారాలు జరుగుతున్నాయని, వాటిని నమ్మొద్దన్నారు. నిజం ఎప్పటికైనా బయటపడుతుందని, న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్ట్.



హైదరాబాద్ : ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్ట్ అయ్యారు. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ ను వేధింపులకు సంబంధించిన కేసులో మిర్యాల గూడ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేశారు.అనంతరం ఆయన్ను హైదరాబాద్ కు తరలిస్తున్నారు. మహిళా ట్రైనీ ఆఫీసర్ హైదరాబాద్ అత్తాపూర్ లో కేసు నమోదు చేయడంతో ఆయన్ను అత్తాపూర్ కు తరలిస్తున్నారు. ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఓ ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణి జూలై 18న అత్తాపూర్ పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టారు. ఆ వెంటనే ఉదయ్ ఆత్మహత్యాయత్నం చేశాడంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కానీ, అతడు అతిగా మద్యం తాగడం వల్ల అపస్మారక స్థితికి చేరుకున్నాడని, అతడి శరీరంలో ఎలాంటి పాయిజన్ ఆనవాళ్లు లేవని ఉదయ్ కు చికిత్స అందించిన డాక్టర్లు స్పష్టం చేశారు.అదే సమయంలో ఉదయ్ సూసైడ్ లెటర్ అంటూ కూడా ఓ పేపర్ వైరల్ అయింది. అంతే, తాను మద్యం మత్తులో రాసి ఉంటానని ఉదయ్ క్లారిటీ ఇవ్వడంతో దానికి ఫుల్ స్టాప్ పడింది

## ప్రతిరోజు పట్టణ ప్రజలకు త్రాగునీరు సరఫరా

-మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్..



ఆత్మకూరు: : ఆత్మకూరు పట్టణ ప్రజలకు ఇకపై ప్రతిరోజూ తాగునీటి సరఫరా అందిస్తామని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ మాట్లాడుతూ సోమశిల -- ఆత్మకూరు పైప్‌లైన్‌లో గత కొన్నేళ్లుగా ఉన్న లీకేజీల వల్ల పైప్లైన్లు పగలడంతో గత 20 రోజులుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి సూచనల మేరకు సమస్యలను వేగవంతంగా పరిష్కరించి మరమ్మతులు చేపట్టి నిరంతర నీటి సరఫరాకు చర్యలు చేపట్టామని తెలిపారు. సోమశిల జలాశయం నుండి వచ్చే త్రాగునీటితో పాటు అప్పారావుపాలెం పెన్నా నుండి ప్రస్తుతం వస్తున్న మంచినీటిని కూడా పట్టణ తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తామని కమిషనర్ తెలిపారు. నీటి ఇబ్బందులకు ఇన్ని రోజులు సహకరించిన పట్టణ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ధన్యవాదాలు తెలుపుతూ పట్టణంలో భవిష్యత్తులో నీటి సమస్య లేకుండా ముందస్తుగా చర్యలు చేపడతామని వారు తెలిపారు. కార్యక్రమంలో వీరివెంట ఏఇలు శ్రీనివాసులురెడ్డి, మాధవి పాల్గొన్నారు

## పేపర్ లీక్ ఆందోళనలో విద్యార్థులకు గుడ్‌న్యూస్.. కేసులు ఎత్తివేసి, విడుదల చేయాలన్న సుప్రీంకోర్టు.



ఢిల్లీ : నీట్ పేపర్ లీక్ ఆందోళన విషయంలో విద్యార్థులకు భారీ ఊరట లభించింది. నేర చరిత్ర లేని 18 ఏళ్ల విద్యార్థులను తక్షణం విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. విద్యార్థులను తక్షణం విడుదల చేయాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని కేంద్రంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఘటనలపై సీసీటీవీ ఫుటేజీ వీడియోలను సమర్పించాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు విద్యార్థులకు ఊరట కలిగిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## ఏపీ ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం చేసుకున్న అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్, బయోటెక్ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థలు.



అమరావతి: : ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్న ఆస్ట్రాజెనెకా ఇండియా. అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ ఆంకాలజీ విధానం ప్రారంభించేందుకు వీలుగా కీలకమైన అవగాహనా ఒప్పందం.ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్ రోగుల కోసం అధునాతన జన్యు పరీక్షలు బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్న ఆస్ట్రాజెనెకా.ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఒప్పందం లక్ష్యమని పేర్కొన్న సీఎం చంద్రబాబు.

## రెవెన్యూ సేవలపై ప్రజల్లో సానుకూల స్పందన పెంపొందేలా అధికారులు పనిచేయాలి..!

**-జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.**



కడప : మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు సమావేశ మందిరంలో భూ సంబంధిత రెవెన్యూ సమస్యలు, ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందించడం, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనాతో కలిసి ఆర్డీవోలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం లో భూ సంబంధిత అర్జీలు, ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా, త్వరితగతిన స్పందించినప్పుడే రెవెన్యూ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, సమస్యలు, అభ్యంతరాలను ఆగస్టు 15వ తేదీలోపు పూర్తిస్థాయిలో పరిష్కరించి పెండెన్సీని "సున్నా" స్థాయికి తీసుకురావాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా.. పెండింగ్ లోవున్న అన్ని రెవెన్యూ సమస్యలను పరిష్కరించి పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. మండల స్థాయిలో ప్రతి వారం, జిల్లా స్థాయిలో ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షలు నిర్వహిస్తూ అందిన ప్రతి సమస్యకు పరిష్కారాన్ని అందించాలని తెలిపారు. సమీక్ష సమావేశంలో రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ఐఎల్ఆర్ ఇష్యూల పరిష్కారం, సెక్షన్ 22-ఏకు సంబంధించిన అన్ని దరఖాస్తులను సకాలంలో పరిష్కరించడం, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయడం, అలాగే ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) పెంపొందించే మూడు కీలక పనితీరు ప్రమాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, ఎస్డీసీ వెంకటపతి, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు మురళి, శిరీష, చంద్రమోహన్, చిన్నయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ వేణుగోపాల్, అన్ని మండలాల తహశీల్దార్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ అక్రమాలపై కడపలో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ



కడప : ఏపీలో మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని రాష్ట్రవ్యాప్తంగా నిరసనల్లో భాగంగా కడప నగరంలో వైఎస్సార్‌సీపీ యూత్, స్టూడెంట్ విభాగాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వైయస్సార్సీపీ కార్యాలయం నుంచి కోటిరెడ్డి సర్కిల్ మీదుగా వైవీ స్ట్రీట్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజాద్ భాష, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. డీఎస్సీ ప్రశ్నాపత్రాల తయారీ, అప్‌లోడింగ్ బాధ్యతలను ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి అప్పగించారని, దీనివల్ల పేపర్ లీక్ అయిందన్నారు. అర్హులైన అభ్యర్థులు కేవలం 0.1 మార్కుతో కూడా ఉద్యోగాలు కోల్పోయారన్నారు. దీనిపై వెంటనే సీబీఐ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌కు సోషల్ స్టడీస్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు రావడం, స్పోర్ట్స్ కోటాలో దాదాపు 400 డీఎస్సీ పోస్టులను నకిలీ, చెల్లని క్రీడా ధృవీకరణ పత్రాల ద్వారా భర్తీ చేశారని ఆరోపణలు వచ్చాయి. దేశంలో నీట్ అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తరహాలోనే, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నారా లోకేష్ రాజీనామా చేసేవరకు పోరాటం చేస్తామన్నారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, దేవిరెడ్డి ఆదిత్య, పులి సునీల్ కుమార్, జిల్లా యస్సీ అధ్యక్షులు సింగమాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## భారీ నుంచి అత్యంత భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ : భారత వాతావరణ శాఖ ప్రాంతీయ వాతావరణ కేంద్రం, నాగ్‌పూర్ విడుదల చేసిన తాజా వాతావరణ హెచ్చరికల ప్రకారం ఈ నెల 28 నుండి 31వ తేదీ వరకు పలు ప్రాంతాలలో ఉరుములు, మెరుపులు, గంటకు 40--50 కి.మీ. వేగంతో ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాలు, వాగులు, వంకలు, నదుల సమీపాలకు వెళ్లకుండా ఉండాలని, ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండరాదని తెలిపారు. భారీ వర్షాల కారణంగా రహదారులపై నీరు నిలువడం, రవాణాకు అంతరాయం కలగడం, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, బలహీన నిర్మాణాలకు నష్టం కలిగే అవకాశం ఉందని, రైతులు పంటలు, వ్యవసాయ పరికరాల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు స్థానిక అధికార యంత్రాంగం, వాతావరణ శాఖ జారీ చేసే తాజా హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రజారక్షణలో అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ పాత పద్ధతిలోనే అమలు చేయాలి: టిఎన్ఎస్ఎఫ్



ఖమ్మం : ఖమ్మం నగరం: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న 8,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని పాత పద్ధతిలోనే అమలు చేయాలని మరియు పెండింగ్ లో ఉన్న బకాయిలు విడుదల చేయకుండా 14 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుంటోంది అని టియన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు కాసాని బ్రహ్మం వ్యాఖ్యానించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యని పరిష్కరించాలని కోరారు, లేకుంటే పెద్ద ఎత్తున విద్యార్థులతో తరగతులు బహిష్కరించి టియన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలతో కలెక్టరేట్ ను ముట్టడిస్తామని వెల్లడించారు.

## ముద్దప్పగారిపల్లెలో తాగునీటి బోరు ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక ఇబ్బందులు..



కడప: : వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం కే.ఎర్రగుడి గ్రామంలోని ముద్దప్పగారిపల్లెలో తాగునీటి బోరుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ రెండు నెలలుగా పనిచేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేస్తామని ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు దించి ఇప్పటి వరకు తిరిగి అమర్చలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. త్రాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేసి బోరుకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## NSS ప్రోగ్రాం ఆఫీసర్ నడింపల్లి వెంకటేశ్వర్లు కి సముచిత గౌరవం



నకిరేకల్ : నార్కెట్ పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నడింపల్లి వెంకటేశ్వర్లు కి ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని (సర్టిఫికేట్) అందజేసి, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేదరి షీబా చేతుల మీదుగా వెంకటేశ్వర్లు ఈ సర్టిఫికేట్‌ను అందుకున్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులలో సేవా భావాన్ని పెంచి, వారు నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించినందుకు గాను ఈ గౌరవం ఆయనకు లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మేదరి షీబా మాట్లాడుతూ, కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం చాలా చురుగ్గా పనిచేస్తుందని, అందుకు వెంకటేశ్వర్లు కృషి మరియు పర్యవేక్షణ ఎంతగానో దోహదపడిందని పేర్కొన్నారు. విద్యార్థులు సమాజ సేవకు అంకితమయ్యేలా వారిని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారని ఆమె కొనియాడారు.ఈ గౌరవం ఆయనకు మరింత స్ఫూర్తినిస్తుందని, భవిష్యత్తులో కూడా కళాశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయురాలు అరుణ,బేబీ తదితరులు కూడా వెంకటేశ్వర్లు ని అభినందించారు

## జీపీఏ పేరిట కోట్ల మోసం సోమాజిగూడలో బాధితుల ఆవేదన



హైదరాబాద్ న్యూస్ : భారీ భవన నిర్మాణాల వద్దకు వెళ్లి భవన నిర్మాణాలకు సహకరించడంతో పాటు విక్రయించి పెడతానని నమ్మించి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) చేయించుకొని కోట్ల లో మోసానికి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులు కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, న్యాయవాది భరత్ తో కలిసి మాట్లాడారు. లోలం శేఖర్ అనే వ్యక్తి భారీ బవంతుల నిర్మాణాల వద్దకు వచ్చి అన్ని రకాలుగా సహకరిస్తానని చెప్పి జీపీఏ చేసుకొని తీవ్ర వేధింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. జీపీఏ సమయంలో ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకపోగా తమ ప్రమేయం లేకుండానే భవనాలను విక్రయిస్తూ తమను నిండా ముంచుతున్నాడని కన్నీరు పెట్టుకున్నారు. ఎంతో శ్రమించి నిర్మించుకున్న భవనాల వద్దకు అసలు యజమానులుగా వెళ్లిన తమ్మ పైనే దాడులకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో రాజీ పడొద్దు - కమిషనర్ డాక్టర్ పి. భవాని ప్రసాద్



కడప : : కడప నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ పి. భవాని ప్రసాద్ నేడు నిర్వహించిన మార్నింగ్ విజిట్‌లో భాగంగా నగర పరిధిలో విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బ్రాహ్మణ స్ట్రీట్, ఇర్కాన్ సర్కిల్, అలంకాన్ పల్లి, చిన్నచౌకపల్లి, మరియు రామరాజుపల్లి ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అధికారులకు పలు సూచనలు చేస్తూ, రోడ్ల స్వీపింగ్ పనులను ప్రతిరోజూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, చెత్త సకాలంలో తొలగించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అనంతరం జెడ్పీ ప్రాంగణంలోని అన్నా క్యాంటీన్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

## జైపాల్ రెడ్డి వర్ధంతి స్ఫూర్తి స్థల్ వద్ద నివాళులర్పించిన పొన్నం



హైదరాబాద్ : మాజీ కేంద్ర మంత్రి అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత జైపాల్ రెడ్డి గారి 7 వ వర్ధంతి సందర్భంగా స్ఫూర్తి స్థల్ లో ఆయన స్మారకానికి నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ జైపాల్ రెడ్డి గారి వర్ధంతి సందర్భంగా నివాళులు. దేశంలోనే ఎంతో ఆదరణ పొందిన నాయకుడిగా, లోక్‌సభ మరియు రాజ్యసభల్లో ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహనతో, పదునైన ప్రసంగాలతో గళమెత్తిన మేధావి అత్యుత్తమ పార్లమెంటేరియన్. 15 వ లోక్ సభ లో తో పార్లమెంట్ సభ్యుడిగా నేను కొత్తగా పార్లమెంట్ లో అడుగుపెట్టినపుడు ఆయన మాకు ఎంతో స్ఫూర్తి కలిగించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ప్రక్రియలో మరియు పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందడంలో జైపాల్ రెడ్డి గారు ఎంతో కృషి చేశారు.

## కోట్లు ఖర్చుపెట్టి వదిలేసిన విద్యుత్ దహన వాటికను వెంటనే ప్రారంభించాలి: సీపీఎం



కడప: : కడప నగరంలోని మూడో డివిజన్ సబ్ జైలు వెనుక రూ.1.20 కోట్లతో నిర్మించిన విద్యుత్ దహన వాటిక నాలుగేళ్లుగా వినియోగంలోకి రాకపోవడంపై సీపీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం దహన వాటికను పరిశీలించిన సీపీఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్, యంత్రాలు తుప్పు పట్టిపోతున్నాయని, గ్యాస్ సిలిండర్లు, ఇతర పరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయని అన్నారు. వెంటనే దహన వాటికను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ప్రభుత్వ ఉద్యోగాలు, స్టార్టప్‌లపై వైవీయూలో కెరీర్ అవగాహన సదస్సు



కడప: : యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్ఎస్ఎస్ యూనిట్--9 సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, స్వయం ఉపాధి, స్టార్టప్‌లపై కెరీర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న జిల్లా ఉపాధి అధికారి ఎ. సురేష్ కుమార్, విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, స్వయం ఉపాధి, స్టార్టప్‌లు, విదేశీ ఉపాధి అవకాశాలు, వివిధ పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## ఏసీబీ వలలో చిక్కిన హెడ్ కానిస్టేబుల్‌కు 7 ఏళ్ల జైలు శిక్ష

కడప క్రైమ్: : కడప ఏసీబీ నమోదు చేసిన లంచం కేసులో కర్నూలు న్యాయ ద చాజరీ ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పు. లంచం తీసుకున్న ఆరోపణలు రుజువు కావడంతో హెడ్ కానిస్టేబుల్ శ్రీపతి దేవదానాన్ని దోషిగా నిర్ధారించిన కోర్టు. 2018లో ఎర్రగుంట్ల ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో నేరానికి పాల్పడినట్లు తేల్చిన న్యాయస్థానం. మృతుడి కుటుంబానికి సంబంధించిన కేసు పత్రాలు అందజేయడం, అనుకూల దర్యాప్తు నివేదిక నమోదు చేయడం కోసం రూ.9 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరించినట్లు నిర్ధారణ. ఫిర్యాదుదారు బి. పద్మావతి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు ఉచ్చువన్ని నిందితుడిని పట్టుకున్న కేసు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్-7 కింద 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధింపు. సెక్షన్ 13(2) చదవవలసిన 13(1)(d) కింద 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.1 లక్షల జరిమానా విధించిన ప్రత్యేక న్యాయస్థానం. రెండు శిక్షలు ఏకకాలంలో అమలులో ఉండాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు. మొత్తం రూ.3 లక్షల జరిమానా మొత్తాన్ని డిపాజిట్ ఫిర్యాదుదారుకు పరిహారంగా చెల్లించాలని ఆదేశం. ఏసీబీ దర్యాప్తులో అభియోగాలు రుజువు కావడంతో నిందితుడికి కఠిన శిక్ష విధించిన ప్రత్యేక న్యాయస్థానం.

## బద్వేల్ పురపాలక సంఘం హెచ్‌పీ పెట్రోల్ బంకును ఆకస్మికంగా పరిశీలించిన కమీషనర్




కడప జిల్లా బద్వేల్ : బద్వేల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్‌పీ పెట్రోల్ బంకును మున్సిపల్ కమీషనర్ యం.కృష్ణ ఈరోజు ఆకస్మికంగా పరిశీలించారు. ఇంధన నాణ్యత, కొలతల్లో పారదర్శకత ఉండేలా అధికారులకు సూచనలు చేశారు. వినియోగదారులకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు.పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను ఎల్లప్పుడూ పాటించాలని సూచించారు. బంకు పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు నమ్మకమైన సేవలందించడమే పురపాలక సంఘం లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు.

## నవనిర్మాత మజుందర్ ఆధునిక విప్లవలకు ఆదర్శం.



జనగామ జిల్లా పాలకుర్తి: సీపీఐ ఎం ఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో భారత విప్లవోద్యమ చరిత్రలో నవభారత నిర్మాత, ఆధునిక విప్లవాలకు ఆదర్శమూర్తి చారు మజుందార్ 52 వ వర్ధంతి ఘనంగా నివాళులు అర్పించారు. ఘనంగా నివాళులు అర్పించారు.

## అస్సాం వరద బాధితులకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త సహాయక చర్యలు: ప్రధాని నరేంద్ర మోదీ.



ఢిల్లీ / అస్సాం : అస్సాంలో సంభవించిన భారీ వరదల పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, వరద బాధితులకు ఊరట కలిగించేందుకు కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కలసికట్టుగా తీవ్రంగా శ్రమిస్తున్నాయని స్పష్టం చేశారు.పార్లమెంట్ భవన సముదాయంలో అస్సాం రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు సర్బానంద్ సోనోవాల్, పబిత్రా మార్గరెటాతో పాటు బీజేపీ పార్లమెంట్ సభ్యులతో ప్రధాని ప్రత్యేకంగా సమావేశమై అక్కడ నెలకొన్న పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా బాధితులందరి రక్షణ, సంక్షేమం కోసం తాను ప్రార్థిస్తున్నానని తెలిపారు.

# చిన్న శేష వాహనంపై విహరించిన సిద్దేశ్వరుడు.



రాజంపేట, : అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక సిద్దేశ్వర చెన్నకేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి చిన్న శేష వాహనంపై విహరించారు. అదేవిధంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వారు సింహ వాహనంపై విహరించారు. వేద పండితులు స్వామివారిని ప్రత్యేక అలంకరణలో కొలువు తీర్చి వాహనాలపై కూర్చోబెట్టి తాళ్లపాక మాడవీధుల్లో మంగళ వాయిద్యాలు , కోలాటాల నృత్యం నడుమ స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు వారి వారి ఇళ్ళ ముంగిటిలో కాయ కర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దీంతో తాళ్లపాకలో ప్రత్యేక పండుగ వాతావరణం నెలకొంది.

## మందపల్లిలో "ఇంటింటికి తెలుగుదేశం"



రాజంపేట, : తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇంచార్జి చమర్తి జగన్మోహనరాజు ఆదేశాల మేరకు ఈరోజు రాజంపేట మండలం మందపల్లి గ్రామం, బూత్ నెంబర్ 113 లో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం నిర్వహించినట్లు అబ్జర్వర్ పసుపులేటి చంద్రశేఖర్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల విజయాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బూత్ కో-కన్వీనర్ ఎం. విజయకుమార్ వర్మ, మోహన రాజు, వెంకటేశ్వర రాజు, సి. వెంకటేశ్వర రాజు తో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేడుకగా స్నపన తిరుమంజనం



రాజంపేట : అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామంలో జరుగుతున్న సిద్ధేశ్వర చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారికి స్నపన తిరుమంజనం కార్యక్రమం మంగళవారం వేడుకగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారిని ప్రత్యేక అలంకరణలో కొలువుదీర్చి పల్లకిలో కూర్చోబెట్టి తాళ్లపాక మాడ వీధుల్లో శోభాయమానంగా ఊరేగించారు. ఈ సందర్భంగా కళాకారులు నిర్వహించిన కోలాట నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజన మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు మరియు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో బీటెక్ రవి



పులివెందుల : కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 45 రోజుల 'డోర్ టు డోర్' కార్యక్రమంలో భాగంగా సింహాద్రిపురం మండలం కొత్తపల్లె గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి), పులివెందుల నియోజకవర్గ పరిశీలకుడు సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు. బీటెక్ రవి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి, రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కూటమి ప్రభుత్వ విజయాలతో పాటు పులివెందుల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ--- ప్రతి టీడీపీ కార్యకర్త ఈ డోర్ టు డోర్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రజల ఆదరణతో మరింత సేవాభావంతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ ఛైర్మన్, సింహాద్రిపురం టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి జోగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో టీడీపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి, అజ్జగుట్ట రఘునాథరెడ్డి

వేంపల్లి, : వేంపల్లి మండలం వేల్పుల గ్రామంలో టీడీపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి, అజ్జగుట్ట రఘునాథరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్హులైన పేదలకు శాశ్వత నివాస గృహాలు (పక్కా ఇళ్లు) కల్పించాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. అలాగే అర్హులైన వారికి పెన్షన్లు, "తల్లికి వందనం" పథకంలో ఉన్న లోటుపాట్లను పరిష్కరించాలని, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేకపోతున్న కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించాలని పలువురు కోరారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్ల పార్థసారథి రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేర్ల



శేషారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బ్రహ్మయ్య, క్లస్టర్ ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి, కోనపురి శివరాం, వేల్పుల సొసైటీ అధ్యక్షుడు రాగిపిండి సుధాకర్ రెడ్డి, హనుమంత రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, రమణారెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలి రెడ్డి గారి పల్లి లో ఇంటింటి తెలుగుదేశం

రాజంపేట : రాజంపేట మండలం శేషమాంబ పురం గ్రామపంచాయతీ పరిధిలోని బాలు రెడ్డి గారి పల్లె గ్రామంలో ఈరోజు ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు పసుపులేటి చంద్రశేఖర్, రవిరాజు, భీమరాజు, దొరబాబు తదితరులు హాజరయ్యారు. నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ--- తరతరాలకు మరిచిపోని పథకం ఏదైనా ఉందంటే అది 'తల్లికి వందనం' పథకమేనని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం, అలాగే గ్యాస్ సబ్సిడీ డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్న తీరును ప్రజలకు విపులంగా వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలన్నదే ధ్యేయమని, ఇప్పటివరకు పథకాలు అందని వారు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే, వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా తగిన చర్యలు చేపడతామని హాజరైన నేతలు హామీ ఇచ్చారు.

## సీఎం చంద్రబాబును కలిసిన మదనపల్లె మైనార్టీ నేతలు



అన్నమయ్య జిల్లా, మదనపల్లె : సీఎం చంద్రబాబును మంగళవారం మదనపల్లె మైనార్టీ నేతలు వెలగపూడిలో మర్యాద పూర్వకంగా కలిశారు. మదనపల్లె షాదీ మహల్ పునరుద్ధరణ, నియోజకవర్గ అభివృద్ధి, మైనార్టీ కాలనీల్లో మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు మైనార్టీ వ్యవహారాల శాఖ సలహాదారు అహమ్మద్ షరీఫ్ తెలిపారు. ఆయన వెంట మదనపల్లె, రాయచోటిలకు చెందిన మైనార్టీ నేతలు ఉన్నారు.

## 30 టన్నుల టమోటా కొనుగోలు చేసిన ప్రభుత్వం: ఛైర్మన్



అన్నమయ్య జిల్లా, మదనపల్లె : మదనపల్లెలో టమాటా ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో టొమాటో మార్కెట్‌కు రైతులు తెచ్చిన 30 టన్నుల టమాటాను ప్రభుత్వం కొన్నట్లు ఛైర్మన్ జంగాల శివరాం మంగళవారం తెలిపారు. ప్రభుత్వం విశాఖపట్నం, మచిలీపట్నంకు ఈ కాయలు తరలిస్తుందన్నారు. రీజినల్ జాయింట్ డైరెక్టర్ రామాంజులు, సెక్రటరీ జగదీష్, అసిస్టెంట్ సెక్రటరీ అఖిలాష్, ఆధ్వర్యంలో టమాటలను ప్రభుత్వం కొనుగోలు చేసి విశాఖకు తరలించినట్లు చెప్పారు.

# గుర్తింపు పత్రాలతో వాహనాలను నడపాలి:: సీఐ చంద్రశేఖర్




తిరుపతి జిల్లా రైల్వే కోడూరు వాహనదారులు తప్పక వాహనాలకు సంబంధించిన గుర్తింపు పత్రాలతో వాహనాలను నడపాలని రైల్వేకోడూరు సిఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం వాహనాలను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. రైల్వే కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అనధికారకంగా మార్పులు చేసిన బుల్లెట్ సైలెన్సర్లు, నిబంధనలకు విరుద్ధమైన ఫ్యాన్సీ నెంబర్ ప్లేట్లు మరియు అనుమతులు లేని స్టిక్కర్లు మైనర్ డ్రైవింగ్ తదితర వాటిపై తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రత్యేకంగా అధిక శబ్దం వచ్చేలా చట్టవిరుద్ధంగా మార్పులు చేసిన బుల్లెట్ సైలెన్సర్లు వెంటనే తొలగించుకోవాలని తెలిపారు. అనుమతి లేని పోలీస్, ప్రెస్, రెవిన్యూ మరియు ఇతర స్టిక్కర్లతో తిరుగుతున్న వాహనాలను గుర్తించి సంబంధిత వాహనదారులపై మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం అయినది అని అన్నారు. ఇలాంటి తనిఖీ నిరంతరం కొనసాగుతాయని నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి మినహాయింపు లేదని కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సదరం' సర్టిఫికెట్ల సమస్యల తక్షణ పరిష్కారానికి BYS డిమాండ్



అన్నమయ్య జిల్లా, మదనపల్లె అన్నమయ్య జిల్లాలో సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల జారీలో నెలకొన్న సాంకేతిక సమస్యలు, స్లాట్ బుకింగ్ ఇబ్బందులు, సర్టిఫికెట్ల జాప్యాన్ని వెంటనే పరిష్కరించాలని కోరుతూ బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్ కుమార్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. లక్ష్మీ నరసయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ, సర్వర్ లోపాలు, డిజిటల్ సంతకాల జాప్యం కారణంగా అర్హులైన దివ్యాంగులు నెలల తరబడి సదరం సర్టిఫికెట్ల కోసం నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దివ్యాంగుల పింఛన్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక సదరం శిబిరాలు నిర్వహించాలని, సర్వర్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని, సర్టిఫికెట్లను వెంటనే ఆన్‌లైన్‌లో జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కులను పరిరక్షించే దిశగా జిల్లా యంత్రాంగం అత్యవసరంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని బహుజన యువసేన తరపున పునీత్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## కడప జైల్లను సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ మంగళవారం కడప పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారం, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసులు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసిన ఆయన ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఖైదీల హక్కులు, లీగల్ ఎయిడ్ సేవలు, హెల్ప్‌లైన్ 15100 పై అవగాహన కల్పించి, జైలు అధికారులు, వైద్యాధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన డిఆర్వో.



కడప : : ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు శుక్రవారం కడప నగర పరిధిలోని కొండాయపల్లె స్వర్ణ వార్డు సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యుల ఓటరు వివరాల నమోదు, మ్యాపింగ్, ఎన్ రోల్మెంట్ ఫారాల ఫిల్లింగ్, డిజిటలైజషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని బిఎల్ఓ లకు పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, కేఎంసీ అధనపు కమిషనర్ రాకేష్ చంద్రం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## 4,5 తేదీలలో ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో ప్రత్యేక డిజిటలైజేషన్ కార్యక్రమం ఓటర్లు సద్వినియోగం చేసుకోండి.

ప్రొద్దుటూరు: : 132-ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలందరికీ తెలియజేస్తూ జులై 04 05 తేదీలలో ప్రత్యేక డిజిటలైజేషన్ కార్యక్రమం నిర్వహించబడుచున్నది. ఈ సందర్భంగా ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బి ఎల్ ఓ) అందుబాటులో ఉండి, ఇంటింటికి ఎన్యుమరేషన్ ఫారములు స్వీకరణ మరియు డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వి వెంకటపతివెంకటపతి ఒక ప్రకటనలో తెలిపారు. కావున నియోజకవర్గ ఓటర్లు అందరూ తమ ఎన్యుమరేషన్ ఫారములను పూర్తి వివరాలతో నింపి, మీ ఎన్యుమరేషన్ ఫారములో ఏవైనా సందేహాలు ఉన్నచో తమ బి ఎల్ ఓ లను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకొని అవసరమైన సంబంధిత పత్రాలను తమ బూత్ లెవల్ అధికారులకు అందజేసి డిజిటలైజేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయవలసిందిగా విజ్ఞప్తి చేయడమైనది. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఓటర్లు అందరూ సద్వినియోగం చేసుకొని, ఎన్నికల జాబితా వివరాలు సక్రమంగా నమోదయ్యేలా ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందించవలసిందిగా కోరడమైనది

# నూతన ఆర్డిని కలిసిన ఎన్జీవో నాయకులు



కడప, : వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ (జోన్-4, కడప) గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ గీతా బాయ్ ని కడప జిల్లా ఏపీ ఎన్జీజివో అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.? కడప జిల్లా ఏపీ ఎన్జీజివో అసోసియేషన్ అధ్యక్షులు బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నూతన డైరెక్టర్ గారికి అసోసియేషన్ తరఫున శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై నూతన డైరెక్టర్ తో అసోసియేషన్ నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు డైరెక్టర్ను కోరారు. ?ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ... జోన్-4 పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలను నూతన ఆర్డీ గారి దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి ఆమె సానుకూలంగా స్పందించారని అలాగే ఏ ఎన్ యం నుండి స్టాఫ్ నర్స్ గా పదోన్నతికల్పించినందుకు డైరెక్ట్ డాక్టర్ గీతా బాయ్ కి హృదయ పూర్వకధన్యవాదములు తెలిపారు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారని శ్రీనివాసులు పేర్కొన్నారు.?కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు: వేణుగోపాల్ రెడ్డి (అన్నమయ్య జిల్లా అధ్యక్షులు), పి. నిత్యపూజయ్య (కడప జిల్లా కార్యదర్శి) బాలపుల్లయ్య, ? సిద్దయ్య(కడప జిల్లా ఉపాధ్యక్షులు) పద్మనాభరావు (జాయింట్ సెక్రటరీ)చిన్నయ్య (సిటీ ప్రెసిడెంట్) జిల్లా ఉమెన్ వింగ్ కన్వీనర్ శ్రీమతి సునీతా సుకుమార్ (పులివెందుల సహా అధ్యక్షులు)నరేష్, శేఖర్ మరియు తదితరులు పాల్గొన్నారు

# హెచ్పిసిఎల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

కడప : డ్రైవర్లు సురక్షితంగా ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి, రవాణాను సురక్షితంగా అందించాలంటే డ్రైవర్లపై వత్తిడి లేకుండా యాజమాన్యం మంచి నదుపాయాలతో చూసుకోవాలని, అప్పుడే రవాణా సురక్షితంగా చేరుతుందని, హెచ్పీసీఎల్ డ్రైవర్ అండ్ హెల్పర్ యూనియన్ అధ్యక్షులు రవిశంకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బాకరాపేట వద్ద గల హెచ్పీసీఎల్ డిపో నందు కార్మికులతో కలసి వారి సమస్యలపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్పీసీఎల్ డిపో నందు డ్రైవర్, హెల్పర్లకు సరైన వసతులు లేవని వాటిపై 4 నెలల నుంచి యాజమాన్యానికి తెలియజేసిన వారు పెద్దగా స్పందించడం లేదని, కనీస వసతులు లేకపోవడం వలన విధులు నిర్వహించడం కష్టంగా ఉందని, కార్మికులకు కనీస సౌకర్యాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పని వేళలు అత్యవసర సందర్భం మినహాయించి లోడింగ్ సాయంత్రానికి పూర్తి చేయాలని, కార్మికుల పట్ల



మృదుస్వభావం కలిగి వారికి తగిన గౌరవాన్ని ఇచ్చి వారికి అన్ని వసతులను కల్పించాలని ఆయన కోరారు. స్పందించిన డిఎం, మంచినీటి కుళాయి దాని విభాగం ఈరోజు సాయంత్రానికే పూర్తి చేస్తామని, మిగిలిన వసతులన్నీ పై అధికారుల అనుమతితో రానున్న నాలుగు నెలల్లో మరికొంత నిర్మాణాన్ని చేపట్టి అందరికీ సరిపడా వసతులను కల్పిస్తామని, ఇప్పటికే కార్మికుల కోసం కొన్ని మెరుగైన సౌకర్యాలు చేపట్టామని ఆయన వివరణ ఇచ్చారు.

# నేడు ప్రజా దర్బార్



ప్రొద్దుటూరు: : పట్టణంలోని నెహ్రూ రోడ్ లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి నేడు అనగా 04 వ తేదీ శనివారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలను,విజ్ఞప్తులను ఎమ్మెల్యే కు నేరుగా తెలియజేయవచ్చని నియోజకవర్గ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా దర్బార్ నందు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి కలవడానికి వచ్చే ప్రజలు వారి ఆధార్ కార్డును మరియు రేషన్ కార్డును తీసుకొనిరావల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## రాజంపేట పట్టణంలో రాజంపేట పార్లమెంట్ సమన్వయ కర్త అతికారి కృష్ణ మీడియా సమావేశం..



రాజంపేట : : రాజంపేట పార్లమెంట్ స్థాయిలో ఐదు రోజులుగా జరుగుతున్న జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ .. ఈ కార్యక్రమంను మరో రెండు రోజుల పాటు పెంపు. జనసేన కార్యకర్తల నుంచి వస్తున్న విశేష స్పందనకు గడువు పెంపునకు కార్యకర్తల నుంచి వినతి. మరో రెండు రోజుల పాటు పార్టీ పదవులు, సమస్యలు స్వీకరణకు డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ అనుమతి..

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన PACS చైర్ పర్సన్ జయకృష్ణ



ఒంటిమిట్ట : అతి కారి కృష్ణ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట రామాలయం అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన **PACS** చైర్ పర్సన్ జయకృష్ణ కోరారు. ఉమ్మడి కడప జిల్లా ఓబులవారిపల్లె మండలానికి విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ను రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశామని అన్నారు ఈ సందర్భంగా ఒంటిమిట్ట లో తన నివాసంలో శుక్రవారం,రాజా చైర్ పర్సన్ జయకృష్ణ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణ సూచనల మేరకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను మరియు నియోజకవర్గ జనసేన నాయకులను అలాగే కూటమి పెద్దల సహకారంతో మండల అభివృద్ధి చేసుకోవాలని జనసేన పార్టీ కోసం అంకితభావంతో పనిచేసి జనసైనికులకు వీర మహిళల సమస్యల ను ఒంటిమిట్ట మండల గ్రామ ప్రజల సమస్యలను సమన్వయం చేసుకుంటూ పరిష్కారం కోసం కృషిచేసి గ్రామీణ ప్రాంతాలలో పార్టీ ప్రతిష్ట కోసం దృఢ సంకల్పంతో పని చేయాలని ఆదేశించారని తెలిపారు మాకు అన్ని విధాలుగా సహకరిస్తున్న రాజంపేట జనసేన పార్లమెంట్ సమన్వయ అతి కారి కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు

# సీఎంను కలిసిన ముక్తియార్.



ప్రొద్దుటూరు: : రాయలసీమ స్టీల్ లిమిటెడ్ శంకుస్థాపన కార్యక్రమంనికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సున్నపురాళ్లపల్లెకు విచ్చేసిన సందర్భంగా ఎ.వా. ముక్తియార్ ను ప్రత్యేకంగా పరామర్శించారు. తరువాత కడప జిల్లా ఇన్చార్జ్ మంత్రి సవిత , కమలాపురం శాసనసభ్యులు పుత్తా చైతన్య రెడ్డి, మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ , మాజీ ఎంపీపీ రాఘవ రెడ్డి తో ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఽ ఏపీ స్టేట్ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. వి ఎస్. ముక్తియార్ ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, రాయలసీమ పారిశ్రామిక ప్రగతి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, తదితర అంశాలపై పరస్పరం చర్చించారు ముక్తియార్ గారు మాట్లాడుతూ 2 ఎం టి పీ ఏ సామర్థ్యం గల రూ. 16,350 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడి ( దశల వారీ ) ఉక్కు, సోలార్ ప్రాజెక్టుల ద్వారా 2,700ం ప్రత్యక్ష ఉపాధి, 3830 మెగావాట్స్ దశల వారి సౌర ఽ పవన విద్యుత్ రూ 20,350 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడును రావడం అన్నది సామాన్య విషయం కాదని ఇది కేవలం మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవర జరుగుతుందని ముక్తియార్ ప్రసంగించారు

# ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన - తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు

రాజంపేట పట్టణం : కడప జిల్లా,జమ్మలమడుగు పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు మాన్య నారా చంద్రబాబు నాయుడు కి రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు హెలిపాడ్ వద్దకు చేరుకొని ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గం లోని పలు అభివృద్ధి కార్యక్రమాలు/తాజా రాజకీయ పరిణామాలు గురించి చర్చించినట్లు జగన్ మోహన్ రాజు తెలియజేశారు



# ప్రాథమిక వైద్య సంఘం సభ్యునిగా చంద్రప్రసాద్



కడప : ప్రాథమిక వైద్య సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా కలచంద్ర ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఇటీవల జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన ఎన్నికలు ఏమైంది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు ప్రాథమిక చికిత్స సహకారానికి ఇటు సమాఖ్య పటిష్టతకు కృషి చేస్తానని చంద్రప్రసాద్ చెప్పారు.

## ప్రభుత్వ దవాఖానాలో ప్రపంచ స్థాయి అద్భుతం.. ఉస్మానియా వైద్యులకు మంత్రి దామోదర్ సన్మానం

హైదరాబాద్ : హైదరాబాద్ :భారత్‌లోనే తొలిసారిగా ప్రభుత్వ హాస్పిటల్‌లో ఒకే రోగికి, ఒకేసారి ఐదు అవయవాల (మల్టీ-విసెరల్) మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి దేశ వైద్య చరిత్రలో అరుదైన ఘనత సాధించిన ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్య బృందాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ప్లాంట్ బృందానికి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉస్మానియా డాక్టర్లు తెలంగాణతో పాటు, యావత్ దేశానికే గర్వకారణమైన ఘనతను సాధించారని కొనియాడారు. ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సల్లో ఒకటిగా భావించే మల్టీ-విసెరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను విజయవంతంగా నిర్వహించడం అసాధారణ విజయమన్నారు. డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని ట్రాన్స్‌ప్లాంట్ బృందం 36 గంటల పాటు శ్రమించి ఈ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం అసాధారణ విజయమని కొనియాడారు. ఈ చారిత్రాత్మక విజయానికి కృషి చేసిన ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు, అనస్థీషియా నిపుణులు,



గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు, క్రిటికల్ కేర్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్లు, ఇతర సిబ్బంది అందరికీ మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే, అవయవదానం ద్వారా మరో ప్రాణానికి జీవం పోసిన అవయవదాత కుటుంబ సభ్యుల సేవాభావాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందిస్తూ, “అవయవదానం.. మహాదానం” అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ సమాజంలో విస్తృతంగా చాటి చెప్పాలని పిలుపునిచ్చారు

# ఏపీలో పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీ..ఉత్తర్వులు జారీ..

అమరావతి : ?ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ (03-07-2026) కీలక ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ పరిపాలన శాఖ (జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ ) ఈ మేరకు జీవో నంబర్ 1310ని విడుదల చేసింది.బదిలీ అయిన అధికారులు వెంటనే తమ కొత్త బాధ్యతలను స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి.. కోనంకి అరుణ దేవి: డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన ఈమెను కర్నూలు జిల్లా ఆదోని ఆర్డీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మడకం సావిత్రి: పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఈమెను ఏలూరు జిల్లా పోలవరం ఎస్‌డీసీగా నియమించారు. ( బి. కిషోర్ స్థానంలో). బి. కిషోర్: ఈయనను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ (హీరా ఓ ఖణ) శాఖకు కేటాయిస్తూ.. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా నియమించారు. టీ. శ్రీనివాస రెడ్డి: ఈయనను ఏపీసీఆర్డీఏ పరిధిలో ఎస్‌డీసీగా నియమించారు. జి. భీమారావు: ఈయన కూడా ఏపీసీఆర్డీఏ పరిధిలో ఎస్‌డీసీగా నియమితులయ్యారు. టీ. వెంకట సునీలు: ఈయనను కర్నూలులో హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించారు. ఎస్. ప్రేమంత్ కుమార్: ఈయనను ఏపీసీఆర్డీఏ పరిధిలో ఎస్‌డీసీగా బదిలీ చేశారు. కె. చెన్నయ్య: ఈయనను ఏపీసీఆర్డీఏ పరిధిలో ఎస్‌డీసీగా నియమించారు. ఎస్. రంజనమ్మ: సెలవులో ఉన్న ఈమెను తిరుపతి కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీగా నియమించారు. పి. ధర్మ చంద్రారెడ్డి: ఈయనను ఇండస్ట్రీస్ ఓ కామర్స్ శాఖకు కేటాయిస్తూ.. ఇన్‌క్యాప్ చీఫ్ జనరల్ మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్)గా నియమించారు. బదిలీ అయిన అధికారులు వెంటనే బాధ్యతల నుండి రిలీవ్ అయి, తమ కొత్త స్థానాల్లో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఆదేశించారు. వీరి బాధ్యతల స్వీకరణకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ఉగ్రవాదం వదిలిపెట్టే వరకు సింధు జలాలు వదిలేదే లేదు : పాక్‌కు భారత్ హెచ్చరిక



ఇంటర్నెట్ డెస్క్ : సింధు జలాల ఒప్పందంపై (ఇండస్ వాటర్స్ ట్రీటయ్ ) పాకిస్తాన్ మంత్రులు చేస్తున్న హెచ్చరికలకు భారతదేశం దీటుగా సమాధానమిచ్చింది. సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని ఎగదోయడం, ఉగ్ర కార్యకలాపాలను ప్రోత్సహించడం పూర్తిగా మానుకొనే వరకు సింధు జలాల నిలిపివేత కొనసాగుతుందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూా) స్పష్టం చేసింది.ఉగ్రవాదం విషయంలో తమ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని ఢిల్లీ తేల్చి చెప్పింది. భారత్‌పై పాక్ మంత్రుల అక్కసు. ఇటీవల పాకిస్తాన్ పెట్రోలియం శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్, సమాచార శాఖ మంత్రి అట్టావుల్లా తరార్ భారత్‌ను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సింధు జలాలను భారత్ నియంత్రించడానికి ప్రయత్నిస్తోందని, పాక్‌లోకి చుక్క నీరు కూడా ప్రవహించకుండా పొరుగు దేశ ప్రధాని నరేంద్ర మోదీ అడ్డుకుంటున్నారని ముసాదిక్ ఆరోపించారు. తమ నీటి వాటాకు భంగం కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నీటి అంశం తమ జాతీయ భద్రతతో ముడిపడి ఉందని, 1960 ఒప్పందాన్ని ఎవరూ రద్దు చేయలేరంటూ పాక్ మంత్రులు వ్యాఖ్యానించారు

# నెల రోజుల పసికందు కిడ్నాప్? కేసు.. 72 గంటల్లో ఛేదన



హైదరాబాద్ : హైదరాబాద్ :నెలరోజుల పసికందు కిడ్నాప్ కేసునుసైబరాబాద్ చందానగర్ పోలీసులు 72గంటల్లో ఛేదించారు. ఈ సందర్భంగా శుక్రవారం సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి రమేష్ రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత నెల 30వ తేదీ అర్ధరాత్రి అనంతరం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిద్రిస్తున్న మహిళ వద్ద నుంచి నెల రోజుల వయస్సు గల ఆడశిశువును కిడ్నాప్ చేసిన ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా తప్పిపోయిన, కిడ్నాప్‌కు గురైన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించే క్రమంలో ఈ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని కేవలం 72 గంటల్లోనే కేసును ఛేదించి పాపను సురక్షితంగా రక్షించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సాధిక ముక్సూద్ అనే మహిళకు సంతానం లేకపోవడంతో పాపను అక్రమంగా తెప్పించుకునేందుకు కుట్ర పన్నినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 'ఆమె బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తున్న నిమ్మి జహాన్, రహనుమా అలీల సహాయం కోరింది. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపై నిద్రిస్తున్న కర్ణాటక కు చెందిన కుటుంబం వద్ద నుంచి పసికందును ఎత్తుకెళ్లి ఆటోలో ఎత్తుకెళ్లారు. ఈ శిశువును తీసుకురావడానికి కిడ్నాపర్లకు సాధిక ముక్సూద్ రూ.1.50 లక్షలు చెల్లించినట్లు విచారణలో తేలింది. అనంతరం పాపతో కలిసి కోల్‌కతాకు వెళ్లేందుకు రైల్వే టికెట్లు కూడా బుక్ చేసుకున్నప్పటికీ, వేగంగా స్పందించి వారిని అదుపులోకి తీసుకుని పాపను రక్షించాం' అని తెలిపారు

# ఇక నుంచి సీఎం రేవంత్ సభల్లో కీలక మార్పులు.




హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే సభావేదికల విషయంలో...కీలకమైన మార్పులు చేయాలని భావిస్తున్నారట. సీఎం సెక్యూరిటీ వింగ్ ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం. ఇక మీదట ప్రోటోకాల్ ఉన్న వారు మాత్రమే వేదిక మీద కూర్చునేలా జాగ్రత్తలు తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు కొనసాగుతున్న జంబో సిస్టంను పూర్తిగా మార్చివేయబోతున్నారట. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన పేరుతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు, శంకుస్థాపనలకు ప్రభుత్వం, పార్టీ తరుపున సభలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోకంటే భిన్నంగా..... సీఎం కూర్చునే సభా వేదికపై ఎక్కువ మందికి అవకాశం కల్పిస్తున్నారు.

# కడప నగరంలో అవినీతి నిరోధక శాఖ అధికారుల సోదాలు..

కడప : : తిరుపతి జిల్లా మత్స్యశాఖ అధికారిగా పనిచేస్తున్న నెల్లూరు రెడ్డయ్యను మూడు లక్షలు లంచం తీసుకుంటు ఉండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు. కడపలో రెడ్డయ్యకు ఆస్తులు ఉండడంతో ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నట్టు సమాచారం. గతంలో కడపలో ఇదే అధికారి రెడ్డయ్య పై పలు కేసులు ఉన్నట్టు తెలుస్తోంది. నగరంలో ఆయన ఆస్తులు పైన ఏసీబీ అధికారులు దాడులు చేసి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్టు సమాచారం..

# యంత్రాల మధ్య మనిషి



డెస్క్ : ప్రస్తుత ఆధునిక కాలంలో సాంకేతికత మనిషి జీవితంలో విడదీయలేని భాగమైపోయింది. ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ప్రతి పనిలోనూ డిజిటల్ పరికరాల అవసరం ఎంతో ఉంటోంది. ఈ మార్పు మనిషికి సౌకర్యాలను కల్పించినప్పటికీ, సహజమైన మానవ సంబంధాలను మాత్రం దెబ్బతీస్తోంది. ఒకప్పుడు ఇంటి నిండా మనుషులు, వారి మాటలు, నవ్వులతో సందడిగా ఉండే వాతావరణం నేడు స్మార్ట్‌ఫోన్ల నిశ్శబ్దంతో నిండిపోతోంది. అరచేతిలో ప్రపంచం కనిపిస్తున్నా, పక్కనే ఉన్న మనిషితో మాట్లాడే తీరిక లేకపోవడం నేటి సమాజపు విషాదకర వాస్తవం. గతంలో పండుగలు లేదా శుభకార్యాలు జరిగితే బంధుమిత్రులందరూ ఒకచోట చేరి కష్టసుఖాలు పంచుకునేవారు. నేడు ఆత్మీయ పలకరింపుల స్థానాన్ని సామాజిక మాధ్యమాల సందేశాలు ఆక్రమించాయి. ఒకే గదిలో కూర్చున్నప్పటికీ ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో మునిగిపోతూ, భౌతికంగా దగ్గరగా ఉన్నా మానసికంగా ఎంతో దూరమవుతున్నారు. పలకరింపులు కేవలం ఎమోజీలకే పరిమితమైపోతున్నాయి. కళ్లలోకి చూసి మాట్లాడే ధైర్యం, భావాలను పంచుకునే నేర్పు తగ్గిపోతూ, కేవలం తెరల వెనుక దాక్కునే కృత్రిమ బంధాలు పెరుగుతున్నాయి. పిల్లల పెంపకంలో కూడా డిజిటల్ ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ఒకప్పుడు తాతయ్యలు, అమ్మమ్మలు చెప్పే కథలు వింటూ పెరిగిన పిల్లలు, నేడు ఫోన్లలో కార్టూన్లు చూస్తూ గడుపుతున్నారు. దీనివల్ల వారిలో భావోద్వేగాల అభివృద్ధి తగ్గిపోతోంది. ఇతరుల పట్ల సానుభూతి చూపడం, పంచుకోవడం వంటి విలువలు వారికి తెలియడం లేదు. చిన్న వయసులోనే గాడ్జెట్లకు అలవాటు పడటం వల్ల సామాజికంగా కలవడం వారికి ఒక సవాలుగా మారుతోంది. ఇది భవిష్యత్తులో ఒంటరితనానికి, మానసిక ఒత్తిడికి దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పని ఒత్తిడి పెరగడం వల్ల కార్యాలయాల్లో కూడా సంబంధాలు యాంత్రికంగా మారుతున్నాయి. ఒకప్పుడు సహోద్యోగుల మధ్య ఉండే స్నేహపూర్వక వాతావరణం నేడు కేవలం మెయిల్‌లు, మెసేజ్‌లకే పరిమితమైంది. కేవలం పని మీదనే దృష్టి పెట్టడం వల్ల తోటి వారి కష్టాలను అర్థం చేసుకునే గుణం తగ్గిపోతోంది. టీ బ్రేక్‌లలో కూడా ప్రతి ఒక్కరూ ఫోన్లలో మునిగిపోవడంతో చర్చలు, ఆలోచనల మార్పిడి జరగడం లేదు. ఇది జట్టు పనితీరుపై మాత్రమే కాకుండా, వ్యక్తిగత మానసిక ప్రశాంతతపై కూడా ప్రభావం చూపుతోంది. సామాజిక మాధ్యమాలు ఒకరికొకరు అనుసంధానించబడటానికి ఉపయోగపడుతున్నాయని చెబుతున్నా, అవి వాస్తవానికి వ్యక్తుల మధ్య అపోహలను పెంచుతున్నాయి. ఇతరుల జీవితాల్లోని ఆకర్షణీయమైన చిత్రాలను చూసి, తమ జీవితాలతో పోల్చుకుంటూ అసంతృప్తికి లోనవుతున్నారు. ముఖాముఖి సంభాషణలు లేకపోవడం వల్ల చిన్నపాటి పొరపాట్లు కూడా పెద్ద విభేదాలకు దారితీస్తున్నాయి. మాటలోని తీవ్రతను, కళ్లలోని భావాన్ని అర్థం చేసుకునే అవకాశం లేకపోవడంతో బంధాలు బలహీనపడుతున్నాయి. ప్రతిదీ డిజిటల్ స్క్రీన్‌పైనే చూడటం వల్ల స్పర్శ అనే అమూల్యమైన అనుభూతి కనుమరుగవుతోంది. వృద్ధుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సాంకేతికతతో వేగంగా మారుతున్న ప్రపంచంలో వారు ఒంటరిగా మిగిలిపోతున్నారు. తమ పిల్లలు పక్కనే ఉన్నా వారు ఫోన్లలో బిజీగా ఉండటం వల్ల మాట్లాడే వారు లేక నైరాశ్యంలోకి వెళ్తున్నారు. పాత తరానికి చెందిన వారు కోరుకునేది కేవలం కొంచెం సమయం, ఆత్మీయమైన పలకరింపు మాత్రమే. కానీ నేటి తరం ఆ సమయాన్ని ఇంటర్నెట్‌కే కేటాయిస్తోంది. ఇది సమాజంలో తరాంతరాల మధ్య అగాధాన్ని పెంచుతోంది. వారి అనుభవాల నుండి నేర్చుకోవాల్సిన ఎన్నో విషయాలను నేటి యువత కోల్పోతోంది. నేడు సమాజంలో కనిపిస్తున్న వింత పోకడ ఏమిటంటే, రోడ్డుపై ఎవరైనా ప్రమాదానికి గురైతే సాయం చేయడం కంటే ఫోన్లలో వీడియో తీసేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. మానవత్వం కంటే వ్యూస్ మరియు లైక్స్ ముఖ్యం అనుకోవడం అత్యంత దారుణమైన విషయం. తోటి మనిషి వేదనను చూడలేకపోవడం అనేది సాంకేతికత వల్ల కలిగిన అతిపెద్ద వైకల్యం. ఇతరుల బాధను చూసి స్పందించే గుణం లేనప్పుడు మనం మనుషులుగా ఉండటంలో అర్థం లేదు. ఈ డిజిటల్ వెర్రి మానవ విలువలను పూర్తిగా దిగజారుస్తోంది. సమాజంలో శాంతి, సామరస్యం ఉండాలంటే మానవ సంబంధాలు మళ్లీ బలపడాలి. సాంకేతికతను అవసరానికి మించి వాడకుండా, పరిమితిలో ఉంచుకోవాలి. ప్రతిరోజూ కొంత సమయాన్ని కుటుంబ సభ్యులతో, స్నేహితులతో గడపాలి. ఫోన్లు పక్కన పెట్టి ముఖాముఖి మాట్లాడుకోవడం అలవాటు చేసుకోవాలి. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కళ్లతో చూడాలి తప్ప కెమెరా లెన్స్ ద్వారా కాదు. చిన్నపాటి మార్పులే మన జీవితాల్లో మళ్ళీ ఆత్మీయతను నింపుతాయి. సహజమైన నవ్వులు, మాటలు లేని చోట ఎన్ని సౌకర్యాలు ఉన్నా అది నరకప్రాయమే. విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంచేందుకు పాఠశాలలు చర్యలు తీసుకోవాలి. సామాజిక సేవ, క్రీడలు వంటి కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయడం ద్వారా జట్టుగా పనిచేయడం, తోటి వారిని గౌరవించడం నేర్పించాలి. సాంకేతికత కేవలం ఒక సాధనం మాత్రమే, అది జీవితం కాదని వారికి అర్థం చేయించాలి. సామాజిక విలువలు పునాదులుగా ఉన్నప్పుడే ఒక గొప్ప సమాజం నిర్మించబడుతుంది. భౌతిక దూరాలు తగ్గించడానికి టెక్నాలజీ వాడాలి గానీ, మనసుల మధ్య దూరం పెంచుకోవడానికి కాదు. మనం యంత్రాల మధ్య కాదు, మనుషుల మధ్య బతకాలి. డిజిటల్ యుగంలో మనల్ని మనం కోల్పోకుండా జాగ్రత్తపడాలి. అనుబంధాలను గౌరవించడం, తోటి వారికి సమయాన్ని ఇవ్వడం ద్వారానే మన ఉనికికి సార్థకత లభిస్తుంది. సాంకేతికతను బానిసలుగా కాకుండా, యజమానులుగా వాడుకోవాలి. మన మధ్య ఉన్న గోడలను బద్దలు కొట్టి, ప్రేమాభిమానాలతో కూడిన నవ సమాజాన్ని నిర్మించుకుందాం. మనిషికి మనిషే తోడు అనే నిజాన్ని మర్చిపోకుండా నిత్యం ఆత్మీయతను పంచుకుందాం.

# నకిలీ ఆధార్ కార్డులతో టీటీడీ గదుల అక్రమ బుకింగ్ - అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

తిరుపతి/ తిరుమల : : తిరుమలలో సామాన్య భక్తులకు కేటాయించే టీటీడీ వసతి గదులను నకిలీ ఆధార్ కార్డులతో అక్రమంగా పొందుతూ, గదులు దొరకని భక్తులకు అధిక ధరలకు విక్రయించి అక్రమ లాభాలు పొందుతున్న నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను టీటీడీ విజిలెన్స్ సమాచారంతో తిరుమల ×× టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. 02-07-2026న సి.ఆర్.ఓ. కార్యాలయం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను టీటీడీ సిబ్బంది గుర్తించి పోలీసులకు అప్పగించారు. దర్యాప్తులో మొబైల్ యాప్‌ల ద్వారా నకిలీ ఆధార్ కార్డులను తయారు చేసి టీటీడీ గదులను పొందడం, అనంతరం వాటిని రూ.2,000 నుంచి రూ.3,000 వరకు అధిక ధరలకు భక్తులకు విక్రయిస్తూ వచ్చినట్లు వెల్లడైంది. వారి సమాచారంతో మరో నిందితుడిని కూడా అరెస్టు చేశారు.

అరెస్టు చేసిన నిందితులు:

1. ఎం. వేణుగోపాల్ (తెలంగాణ)
2. దొంత రవీంద్రబాబు (ఆంధ్రప్రదేశ్)
3. సంతోష్ కుమార్ (ఉత్తరప్రదేశ్)
4. టీ. ఈశ్వర్ (తెలంగాణ)

స్వాధీనం:

2 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు

12 నకిలీ ఆధార్ కార్డులు

డిజిటల్ ఆధారాలు



ఈ ముఠా గత కొంతకాలంగా నకిలీ ఆధార్ కార్డులతో టీటీడీ గదులను అక్రమంగా పొందుతూ శ్రీవారి భక్తులను, టీటీడీని మోసం చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ అక్రమ దందాను ఛేదించిన తిరుమల ×× టౌన్ పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులను తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్. మరియు టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి శ్రీ మురళీకృష్ణ, ఐపీఎస్. అభినందించారు.

# మందుల కొనుగోలు, పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన కోసం ప్రత్యేక కమిటీ..



అమరావతి : వైద్యారోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శుక్రవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దాదాపు 4 గంటల పాటు ఈ సమీక్ష సమావేశం సాగింది. సందర్భంగా ఉన్నతాధికారులకు మంత్రి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మందుల కొనుగోలు, పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.రోగుల అవసరాలకు తగ్గట్లు తీసుకోవాల్సిన చర్యలపై రెండు వారాల్లోగా నివేదిక అందించాలని స్పష్టం చేశారు. పరికరాలు, మిషన్ల కొనుగోలు, సరఫరాకు నిర్దిష్ట క్యాలెండర్‌ను రూపొందించాలని ఆదేశించారు. ఆసుపత్రుల భవన నిర్మాణ పనుల్లో వేగాన్ని పెంచాలన్నారు.

## కడప జిల్లా చెన్నూరు మండలానికి చెందిన షేక్ జహీరుద్దీన్ పై పి.డి చట్టం ప్రయోగం.

కడప క్రైమ్ : : ముద్దాయి వై.యస్.ఆర్. కడప జిల్లా, చెన్నూరు మండలం మరియు గ్రామం, రైస్ మిల్లు వీధిలోని డోర్ నెం. 3/51 ఇంటి నందు నివాసముంటున్న రెడ్డి బడే సాహెబ్ ముబారక్ అలియాస్ ఆర్.యం.డి. ముబారక్ కుమారుడగు రెడ్డి బడే సాహెబ్ జహీరుద్దీన్ అలియాస్ అబ్బాన్ అలియాస్ షేక్ జహరుద్దీన్, వయస్సు: 30 సం॥లు. ఇతను చట్టాన్ని గౌరవించకుండా, ప్రభుత్వ ఉద్యోగుల న్యాయ బద్ధమైన విధులు నిర్వహించకుండా వారికి ఆటంకం కలిగించడం, మతపరమైన ఉద్రిక్తతలను ప్రేరేపించడం, చట్టవిరుద్ధమైన సమావేశాలలో పాల్గొనడం, సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, ప్రభుత్వ అధికారులను బెదిరించడం మరియు ప్రజా శాంతికి విఘాతం కలిగించడం వంటి చర్యలు పదే పదే చేయడం. కడప జిల్లాలో ఇతని పై 10 కేసులు నమోదయ్యాయి. రెండవ ముద్దాయి :: తూర్పు గోదావరి జిల్లా, గోకవరం మండలం మరియు పట్టణం, డ్రైవర్స్ కాలనీ, టి.నగర్, డోర్ నెం. 1--412/2 నందు నివాసముంటున్న తొండ ఏసు సతీమణి అయిన తొండ శాంతి అలియాస్ కానమ్మ, వయస్సు: 36 సం॥లు, ఈమె చట్టాన్ని గౌరవించకుండా, తరచుగా చాలా దొంగతనం మరియు ఆస్తి నేరములకు పాల్పడి, పోలీసు వారిచే అరెస్టు కాబడి, బెయిలు పొంది, మరలా తన యొక్క ' వైఖరిని మార్చుకోకుండా ఆస్తి నేరములను తరచుగా నేరముల చేయుచున్నది. కడప జిల్లాలో మరియు ఇతర జిల్లాలో ఈమె పై 38 కేసులు నమోదయ్యాయి. వారి యొక్క చర్యలు ఆంధ్ర ప్రదేశ్ అక్రమ సారా వ్యాపారులు, బంధి పోటులు, మాదక ద్రవ్య నేరస్తులు, గూండాలు, వ్యభిచార నేరస్తులు మరియు భూఆక్రమణదారులు, ప్రమాదకర కార్యకలాపముల నిరోధక చట్టము, 1986లోని సెక్షన్ 2 (ఎఫ్) క్రిందకు వచ్చును. పైన తెలిపిన ముద్దాయిల పై పి.డి చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కడప జిల్లా ఎస్.పి. శ్రీ.షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ.(అడ్మిన్.) కె.ప్రకాష్ బాబు , పర్యవేక్షణలో మరియు సి.శంకర్ రెడ్డి , ఎస్.కె.చాంద్ బాషా (చెన్నూరు ఇన్స్పెక్టర్) మరియు బి. రామకృష్ణ పర్యవేక్షణలో కడప జిల్లా కలెక్టర్ Sri Dr. శ్రీధర్ చెరుకూరి , I.A.S., పి.డి చట్టం క్రింద నిర్బంధ ఉత్తర్వులను జారీ చేయమని ప్రతిపాదనలు సమర్పించడమైనది. దాని మేరకు తేదీ 22.07.2026 న పి.డి చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులను జారీ చేశారు. దానిని సంబంధిత ముద్దాయిపై అమలు నిమిత్తం సెంట్రల్ జైలు అధికారులకు అందచేయడం జరిగినది. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపములు నిర్వహించిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుని, PD Act మరియు జిల్లా బహిష్కరణ చేయడం జరుగుతుంది అని ఎస్పీ చెప్పినారు.

## 24న విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల పిలుపు



కడప: : విజయ్ కుమార్: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 24న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. కడప ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో బంద్ పోస్టర్‌ను విడుదల చేసి, నీట్ పేపర్ లీకేజ్ ఘటనతో పాటు ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జ్‌ను ఖండించాయి. బంద్‌కు విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరాయి.

## పేపర్ లీకేజీలపై ప్రధాని మోదీ సంచలన ప్రకటన.. అలా చేస్తే ఎవ్వరినీ వదలం



ఢిల్లీ : దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీక్ వ్యవహారం సంచలనంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తాజాగా ఈ పేపర్ లీక్‌ల వ్యవహారంపై ప్రధాని మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై పేపర్ లీకేజీ కేసులపై వేగవంతమైన విచారణ జరిపి, నిందితులకు త్వరిత శిక్షలు వేసేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆయన ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ మేరకు ప్రధాని మోదీ వేదిక 'ఎ' పోస్ట్ చేస్తూ.. దేశ యువత భవిష్యత్తు, వారి సంక్షేమమే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటం, పరీక్షల వ్యవస్థలోని పారదర్శకతను రక్షించడం కోసం చేపడుతున్న వరుస చర్యలలో ఇది కూడా ఒక భాగమని మోదీ అన్నారు.

## కూటమి ప్రభుత్వం 2 సంవత్సరాల విజయోత్సవ పాలన ఇంటింటి కార్యక్రమం



ప్రొద్దుటూరు: : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం 2 సంవత్సరాల విజయోత్సవ పాలన ఇంటింటి కార్యక్రమం గురువారం సాయంత్రం 04:00 గంటలకు యర్రగుంట్ల బైపాస్ రోడ్డు భారత్ ఫంక్షన్ హాల్ నందు ప్రొద్దుటూరు నియోజకవర్గస్థాయి ఇంటింటికీ క్యాంపెయిన్ మరియు వీ ఛూ చూరా ద్వారా పార్టీ కార్యక్రమాల నిర్వహణపై కీలక సూచనలు సమావేశం నిర్వహించారు. క్లస్టర్,యూనిట్,బూత్ ఇంచార్జీలు,కూటమి ప్రభుత్వ నాయకులు,కార్యకర్తలు హాజరైన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకురాలు కొండవీటి భావన, పట్టణ టీడీపీ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారీ జాకీర్, రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి ముక్తియార్, జనసేన నాయకులు సుంకర మురళీ, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్‌రెడ్డి మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ లక్ష్మణ్, కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసాచారి, పేట చంద్రశేఖర్, నాగరాజు, టీడీపీ నాయకులు నంద్యాల ఆనందభార్గవ రెడ్డి, శుకరాపురం ప్రసాద్ రెడ్డి, ఈవీ సుధాకరరెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షులు సిద్ధారెడ్డి, నాగముని రెడ్డి, పర్లేటి చంద్రశేఖర్, టీడీపీ యువ నాయకులు బచ్చల వీరప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిసిటీ అని ఎలా అంటారు?.. ఢిల్లీ పోలీసులపై హైకోర్టు ఆగ్రహం




ఢిల్లీ : : కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) పార్లమెంట్ ర్యాలీలో ఆందోళనకారులపై లాఠీ ఛార్జ్ చేసినందుకు ఢిల్లీ హైకోర్టు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది.పబ్లిసిటీ కోసం విద్యార్థులు నిరసనల్లో పాల్గొన్నారని పోలీసులు చేసిన వ్యాఖ్యలను తప్పు పట్టింది. సీసీ కెమెరాలు, పోలీసుల బాడీ కెమెరాల ఫుటేజీలు, నిరసనలకు సంబంధించిన అన్ని డిజిటల్ రికార్డులను భద్రపర్చాలని ఆదేశించింది. నిరసనకారులతో అమానుషంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై నాలుగు వారాల్లోగా పోలీసులు స్పందించాలని పేర్కొంది. ఈ కేసులో విచారణను సెప్టెంబర్ 11కు వాయిదా వేసింది.

## విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి అడ్లూరి!



హైదరాబాద్ న్యూస్ : రాష్ట్రంలోని సంక్షేమ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకాహారం, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. విక్టోరియా మెమోరియల్ హోమ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించిన యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్ ය అమెనిటీస్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రామ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు, ఇతర అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు మార్పు కోసం అవకాశం ఇచ్చిన తర్వాత 2023 డిసెంబర్‌లో బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సంక్షేమ విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు.

## పులివెందుల సబ్‌జైలు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి




పులివెందుల : విజయ్ కుమార్: గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.ఎస్. బాబా ఫక్రుద్దీన్‌లు పులివెందుల సబ్‌జైలు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించారు. ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలపై అవగాహన కల్పించి, ఖైదీల కేసులు, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అలాగే 15100 లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్‌లు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, జైలు అధికారులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో కూడిన నాయకత్వమే విజయానికి పునాది: ప్రిన్సిపాల్ మునీష్ మీనా




కడప : కడపలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ లిలిమునీష్ మీనాలి మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, బాధ్యత, నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటే అవే భవిష్యత్తు విజయాలకు పునాదిగా నిలుస్తాయని అన్నారు. ఈ విద్యా సంవత్సరానికి లిభాగ్యలక్ష్మిలి బాలికల ప్రధాన నాయకురాలిగా, లిహర్షవర్ధన్‌లి బాలుర ప్రధాన నాయకుడిగా బాధ్యతలు స్వీకరించగా, హౌస్ కెప్టెన్లకు బ్యాడ్జీలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంజాయి, మత్తు పదార్థాలపై డాగ్ స్క్వాడ్‌తో మధిరలో ముమ్మర తనిఖీలు

–గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు టౌన్ సీఐ డి.రమేష్



ఖమ్మం : మధిర పట్టణంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయాలను అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా ఏసీపీ శ్రీ సారంగపాణి ఆధ్వర్యంలో మధిర టౌన్ సీఐ డి.రమేష్, ఎస్ఐలు కిషోర్ కుమార్, సవిత, మరియు మధిర టౌన్ పోలీసులు గురువారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే రైల్వే స్టేషన్, బస్టాండ్, స్థానిక హోటళ్ళు, పాఠశాలలు, కళాశాలల ఆవరణలో ఉన్నటువంటి పాన్ షాప్ లో చాయ్ కొట్లు, కొరియర్ సర్వీస్ స్టాక్ పాయింట్స్ అయిన అమెజాన్, ఫ్లిప్కార్ట్, తదితర ప్రాంతాలలో ప్రత్యేక డాగ్ స్క్వాడ్‌తో జల్లెడ పట్టారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ కు చర్యలు.

ఆసిఫాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ మరియు తుమ్మిడిహెట్టి నిర్మాణం పై కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సి. ఆర్ పాటిల్ గారితో చర్చించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. న్యూ ఢిల్లీ లోని కేంద్ర జల శక్తి శాఖా మంత్రి శ్రీ సి. ఆర్. పాటిల్ గారి అధికారిక నివాసంలో ఈ రోజు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీల ప్రతినిధి బృందం వారిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పై సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ అనుపమ్ ప్రసాద్ వారి సమక్షంలో వివిధ అంశాలను చర్చించడం జరిగింది. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి ఈ విషయంలో తగు చర్యలు తీసుకుంటామని హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీ కిషన్ రెడ్డి, ఎంపీలు డీకె అరుణ, ఈటెల రాజేందర్, గోడం నగేష్, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేట మండలం గుండ్లూరు నేషనల్ హైవే ప్రొటెక్షన్ వాల్ ధ్వంసం...



కడప జిల్లా :కడప జిల్లా నందలూరు :(ప్రశ్నించే హక్కు: జూలై 23: దాదాపు పది అడుగుల మేర ప్రైవేట్ స్థలానికి సంబంధించిన వ్యక్తులు తొలగించినట్లు సమాచారం... సమీపంలోని లాడ్జి తో పాటూ కళ్యాణ మండపం నిర్మిస్తున్న వ్యక్తి తన అవసరాల మేరకు రక్షణ గోడను తొలగించినట్లు ఆరోపణలు.... గతంలో కూడా ఇదే ప్రాంతంలో అనుమతులు లేకుండా గోడ తొలగించినట్లు ఆరోపణలు... తిరిగి మళ్లీ కూడా తొలగించడంలో నేషనల్ హైవే అధికారుల అనుమతులు ఉన్నాయా... ఉంటే సమీప ప్రాంతంలో చిరు దుకాణాల వారికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్న...

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.. జూలై 30న 'చలో కలెక్టర్'కు పిలుపు



కడప: : కడప ఎర్రముక్కపల్లి సర్కిల్ వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు మృతుల కుటుంబాలకు ఉద్యోగాలు, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే జూలై 30న నిర్వహించే లిచలో కలెక్టర్‌లి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేస్తామని సంఘం నాయకులు హెచ్చరించారు.

# రైతులకు న్యాయం జరిగేనా..?

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు : రైల్వేకోడూరు మండలంలోని బొప్పాయి సాగు చేస్తున్న రైతులు ఈ ఏడాదైనా అప్పుల నుండి గట్టెక్కేనా అన్నా అనుమానాలు రైతుల్లో రేకెత్తిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా అత్యంత ఖరీదైన బొప్పాయి మొక్కలను కొని, సాగు చేసి వాటిని ఫలితం వచ్చేంతవరకు కష్టపడి సాగు చేయడంతో ఈ ఏడాదైనా పంట ద్వారా కొంత అప్పుల నుండి ఊపిరి పీల్చుకోగలమా అన్నా అనుమానాలను బొప్పాయి రైతుల్లో ఆందోళన కలిగిస్తున్న సందర్భంలో బొప్పాయి వ్యాపారస్తులు 18 నుండి 14 కు రేటు పలకడంతో ఒక్కసారిగా బొప్పాయి రైతులు రైల్వే కోడూరు మండలంలో పలుచోట్ల నిరసనలు తెలియజేసిన నేపథ్యంలో సమాచారాన్ని జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి రావడంతో తిరుపతి జాయింట్ కలెక్టర్ రావడం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో రైతులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ఎటికేక్షకు బొప్పాయి రైతులకు సరైన ధరలు కేటాయించి వారికి నష్టం వాటిల్లకుండా వారిని లాభాల బాటిలోనే పయనించే విధంగా జిల్లా అధికారులు చొరవ తీసుకోవడం రైతుల్లో పక్కింత ఆనందాలు వెల్లువిరుస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ బొప్పాయి రైతుల గతంలో ఎటువంటి పలు రకాల నిరసనలు జరిగిన విషయం విధితమే. ఈ సందర్భంగా కాయకష్టం చేసి బొప్పాయి రైతులు



ఎన్నో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బొప్పాయి సాగును నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా రైతులు సాగు చేశారు. ఇప్పటికైనా దళారులు బొప్పాయి రైతులను నట్టేట ముంచకుండా సాగు చేసిన కష్టానికి ఫలితం చూడాలని రైల్వే కోడూరు సిపిఐ కి చెందిన రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, సిపిఐ నాయకులు జ్యోతి చిన్నయ్య, చిన్న రాజు, చింతలపూడి నాగమ్మ, డీ హెచ్ పి ఎస్ ఏరియా కార్యదర్శి కటారి గోపాల్ తదితరులు బొప్పాయి పంటను పరిశీలించారు.

# కరీంనగర్‌లో కాంగ్రెస్ భారీ నిరసన - రాహుల్ గాంధీ అరెస్టును ఖండించిన కాంగ్రెస్ నేతలు

-NEET పేపర్ లీక్‌కు బాధ్యత వహించాలి – ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: డిసిసి చీఫ్ డాక్టర్ మేడిపల్లి సత్యం

-రాహుల్ గొంతు నొక్కినా ఉద్యమం ఆగదు: మేడిపల్లి సత్యం

-మోడీ, అమిత్ షా రాజీనామా చేయాలి, నీట్ పేపర్ లీకేజీ పై స్థానిక ఎంపీ ఎందుకు స్పందించడం లేదు –

-బీజేపీ పాలిత రాష్ట్రంలో అయోధ్య రాముని సొమ్ము మాయం.. అయినా స్పందించని మోదీ ప్రభుత్వం – ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

-23 లక్షల విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం – కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ వార్నింగ్

-గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శాంతి యుత నిరసన – వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు

-విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు: కాంగ్రెస్

-ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అరెస్ట్..

-కాంగ్రెస్ శ్రేణులపై కర్రలతో దాడి చేసిన బీజేపీ కార్యకర్తలు

-పోలీసుల లాఠీ చార్జ్.. పలువురు కాంగ్రెస్ కార్యకర్తలకు తీవ్ర గాయాలు



కరీంనగర్ జిల్లా బ్యూరో : లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అధినాయకులు రాహుల్ గాంధీ మరియు ప్రతిపక్ష నాయకుల అరెస్ట్ ను ఖండిస్తూ, నీట్ పేపర్ లీక్ కు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ తో ఏఐసీసీ మరియు టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు నేడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్, కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ రోడ్డు లో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శాంతి యుత నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం గారు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నిరసన దీక్షను ప్రారంభించారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే పీసీసీఎస్సీ విభాగం చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, హుజురాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితెల ప్రణవ్ బాబు, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య తో పాటు జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజా ప్రతినిధులు నామినేటెడ్ పదవులలో కొనసాగుతున్న ముఖ్య నేతలు మార్కెట్ కమిటీ చైర్మన్ లు సహకార సంఘాల చైర్మన్లు సర్పంచులు బ్లాక్ మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరైనారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం గారు మాట్లాడుతూ.. ఈ దేశంలో దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తే ఆ పరీక్ష లీకేజీకి బాధ్యులైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను తక్షణమే క్యాబినెట్ నుండి తొలగించాలని ఈ లీకేజీ అంశంపై పార్లమెంటులో సుదీర్ఘమైన చర్చ జరపాలని మొన్న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థులు శాంతియుత నిరసన చేపడితే ఈ దేశంలోని ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా ప్రభుత్వం ఆ విద్యార్థి యువతపై విచక్షణ అహితంగా దాడులు చేసినారో మనమంతా చూసాము.. ఈ విషయంపై స్పందిస్తూ నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న స్వయంగా లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ గారితో పాటు ప్రతిపక్ష నాయకులు ప్రధాని ఇంటి ముందు బైఠాయించి జంతర్ మంతర్ వద్ద విద్యార్థి యువతపై దాడులు చేసినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలని నీట్ పేపర్ లీకేజీకి కారణమైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి అమిత్ షా క్షమాపణ చెప్పాలి నరేంద్ర మోడీ పదవి నుండి తప్పుకోవాలి అని డిమాండ్ చేస్తే రాహుల్ గాంధీ గారితో పాటు ఇతర నాయకుల పై దాడులకు పాల్పడి అరెస్టులు చేయడం జరిగింది. ఎంతోమంది తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేసి తమ పిల్లలను చదివిస్తే విద్యార్థులు నిద్రాహారాలు మానేసి ఉజ్వల భవిష్యత్తు కోసం తన కలలను నిజం చేసుకోవడానికి నీట్ పరీక్షలు రాస్తే ఆ పేపర్ లీకేజీకి పాల్పడి ఎంతో మంది విద్యార్థుల చావులకు కారణమైన ధర్మేంద్ర ప్రధాన్ ను తక్షణమే రాజీనామా చేయించాలని, చేతకాని ప్రధాని నరేంద్ర మోడీ పదవి నుండి తప్పుకోవాలి దేశ హోంమంత్రి అమిత్ షా ఈ దేశానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ టిపిసిసి పిలుపు మేరకు విద్యార్థులకు మద్దతుగా కరీంనగర్ పట్టణంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపడుతున్నాము.. ఈ ఉద్యమం ఇప్పుడే ఆగదు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ గొంతు నొక్కినంత మాత్రాన వేము వెనుకడుగు వేయబోము.. రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో విద్యార్థి నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేంతవరకు మా ఉద్యమం, ఆందోళన కొనసాగుతుందని అన్నారు.

## ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్



కొమరం భీం జిల్లా ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్ గారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు మరియు సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొంటూ, ఆసుపత్రిలో ఉన్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోలిమాజీ సర్పంచ్ కాశన్న సీనియర్ లీడర్ నిజం మెడికల్ ప్రిన్సిపాల్ వెంకట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒరిస్సా నుంచి నగరానికి గంజాయి రవాణా స్మగ్లర్ అరెస్ట్!



హైదరాబాద్ న్యూస్ : ఒరిస్సా నుంచి నగరానికి గంజాయి రవాణా స్మగ్లర్ అరెస్ట్! నకుల్ యాదవ్ (27) అనే వ్యక్తి ఒరిస్సా నుంచి తీసుక వచ్చిన గంజాయిని షెర్‌లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి తీసుకునే వ్యక్తి కోసం ఎదురు చూస్తున్న సమయంలో నిందితుడిని పట్టుకున్నారు. ఆతడి వద్ద ఉన్న 14 గంజాయిని, రూ.2890 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.7 లక్షలుగా ఉంటుందని, నిందితుడిని గంజాయిని షేర్ లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మేమిద్దరం ప్రేమించుకున్నాం.. పెళ్లి చేసుకోవాలనుకున్నాం, ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఇప్పటికే హైకోర్టులో దాఖలు చేయగా.. పిటిషన్‌లో కీలక విషయాలను వెల్లడించారు. తనపై ఫిర్యాదు చేసిన మహిళా ఐపీఎస్ అధికారితో ముస్సోరిలో శిక్షణ పొందుతున్న సమయంలో ప్రేమలో ఉన్నానని, ఇద్దరం మానసికంగా, శారీరకంగా సన్నిహితంగా ఉన్నామని, సర్వీస్‌లో చేరిన తర్వాత పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నామని ఉదయ్ కృష్ణారెడ్డి కోర్టుకు తెలిపాడు. అయితే తనకు మరో యువతితో సంబంధం ఉందనే అనుమానంతో ఆమె మే నెలలో ఓ ఐఏఎస్ అధికారిని వివాహం చేసుకుందని ఉదయ్ కృష్ణారెడ్డి వెల్లడించాడు

## నల్గొండలో ప్రముఖ కవి, రచయిత 'స్కైబాబా'కు ఘన సన్మానం!



ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో : ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ ఎం. మసీఉద్దీన్, అడ్వొకేట్ నజీర్ ఉద్దీన్, అడ్వొకేట్ డా. ఎం. ఉమర్, అడ్వొకేట్ కట్టాల శివ (అధ్యక్షుడు, ఎస్సీ/ఎస్టీ విద్యార్థి సంఘం),దర్శనం అమృత రాజ్ (జిల్లా అధ్యక్షుడు, మానవ హక్కుల పరిరక్షణ సంస్థ), సునీల్ (కార్యదర్శి, మానవ హక్కుల పరిరక్షణ సంస్థ), అర్జున్ (ఉపాధ్యక్షుడు, ఎస్సీ/ఎస్టీ విద్యార్థి సంఘం), ముఫ్తీ అఫ్రోజ్ ఖాన్, మౌలానా షేక్ ఫరీద్ సాహెబ్, హఫీజ్ సయ్యద్ జీషాన్ ఉల్లా, మహమ్మద్ మొహియుద్దుల్లా (ఇంగ్లీష్ లెక్చరర్ ఛ యాంకర్), కాకతీయ సిమెంట్స్‌కు చెందిన మహమ్మద్ షఫీ ఉద్దీన్, షఫీ నవాజ్ ఖాన్ (కార్యదర్శి, **IIKBKG**, మాజీ కౌన్సిలర్ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు), బి. రాకేష్ (ఎక్స్‌పోర్ట్--ఇంపోర్ట్ వ్యాపారవేత్త), బహుజన్ ఉద్యమకారుడు చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు స్కైబాబా ఆధునిక భారతీయ సాహిత్యంలో విశిష్ట వ్యక్తిత్వం. ఆయన ప్రముఖ తెలుగు కవి, జర్నలిస్ట్, కథా రచయితగా విశేష గుర్తింపు పొందారు. సామాజిక న్యాయం, దళిత హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఉద్యమకారుడిగా ప్రసిద్ధి చెందారు. చమన్ పత్రికకు ప్రధాన సంపాదకులుగా, ముల్కీ పత్రిక స్థాపకులుగా, అలాగే ముస్లిం రిజర్వేషన్ ఉద్యమానికి ఆద్యులలో ఒకరిగా విశేష సేవలందించారు సాహిత్య రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలు, సామాజిక ఉద్యమాలలో ఆయన పోషించిన కీలక పాత్ర, సమాజానికి అందించిన అమూల్యమైన సేవలను గుర్తిస్తూ ఈ ఘన సన్మానం నిర్వహించారు

## మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితో కోడూరు నాయకుల ప్రత్యేక సమావేశం.



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు : రైల్వేకోడూరు మండలానికి చెందిన వైసిపి నాయకులైన ఆర్వి రమణ, మైనార్టీ నాయకులు షేక్ షఫీ, బీసీ నాయకులు బత్తల మనీతో పాటు పలువురు వైసీపీ కార్యకర్తలు బుధవారం తాడేపల్లి లోని వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు కు చెందిన ప్రముఖ రాజకీయాలపై మాజీ ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఇందులో కొంతమంది పార్టీ కార్యక్రమాలకు వెళ్లకుండా ఒక నాయకుడు పై అసంతృప్తితో రగిలిపోతున్నారని దీనిపై పూర్తిగా వైసిపి పార్టీకి నష్టం జరిగే విధివిధానాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే కోడూరు రాజకీయాలపై చర్చించాలని వారు జగన్మోహన్ రెడ్డితో చర్చించినట్లు వారు తెలిపారు. లేకుంటే రానున్న రోజుల్లో వైసిపి కంచుకోటకు బీటలు బారే పరిస్థితి వస్తుందని వారు తెలియజేశారు

## సీదిరి కుమారుడి కేసు.. దానయ్య కుటుంబానికి రూ. 5 లక్షలు అందించిన పార్థసారథి



అమరావతి : వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ నడిపిన బైక్ ఢీకొని మృతి చెందిన గౌరెల కాపరి దానయ్య కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి బాధిత కుటుంబాన్ని కలిసిన మంత్రి, వారికి ధైర్యం చెప్పి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గొర్రెల కాపరి సంఘం తరపున రూ. 3 లక్షలు, తన తండ్రి జ్ఞాపకార్థం ఉన్న కేపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరో రూ. 2 లక్షలు కలిపి మొత్తం రూ. 5 లక్షల సాయాన్ని కుటుంబ సభ్యులకు స్వయంగా అందించారు. బాధిత కుటుంబ సభ్యుల దీనస్థితిని, సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి, కూటమి ప్రభుత్వం దానయ్య కుటుంబానికి పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాద ఘటనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, బాధ్యులు ఎంతటి వారైనా వదలిపెట్టకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు తమ ప్రభుత్వం వెన్నంటే ఉంటుందని హామీ ఇచ్చారు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి!



హైదరాబాద్ : హైదరాబాద్ :టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగినట్లు వెల్లడైన పోలీసు చర్యను తీవ్రంగా ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల గొంతును అణచివేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని అన్నారు. విద్యార్థులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీమతి ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకులపై జరిగినట్లు వెల్లడైన పోలీసు చర్యను ఆమె తీవ్రంగా ఖండించారు. ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బి. మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన "చలో రాజ్ భవన్" కార్యక్రమంలో డాక్టర్ కోట నీలిమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంఘీభావంగా నిరసన తెలుపుతూ గవర్నర్ నివాసం వద్ద ఆమెతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ ధర్నా: కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు డిమాండ్!



ఆసిఫాబాద్ : డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆదేశాల మేరకు, రెబ్బెన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేసరి కిషన్ గౌడ్ ఆధ్వర్యంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన ధర్నా నిర్వహించారు. నీట్ పేపర్ లీకేజీపై దేశ రాజధాని ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం అవలంబించిన వైఖరిని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి. బాధిత విద్యార్థులు, యువతకు కేంద్ర ప్రభుత్వం ముక్కునేలకు రాసి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చియ్యవరంలో అతుకుబడిపై గ్రామసభ...




తిరుపతి జిల్లా రైల్వే కోడూరు : రైల్వే కోడూరు మండలంలోని చియ్యవరం గ్రామంలో డీటీ గల్లా రమణ, వీఆర్వో అరవ వెంకటయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక రైతు అతుకుబడి పట్టాపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతు అతుకుబడి పట్టాపై గ్రామ సభలను నిర్వహిస్తున్నామని రైతులకు ఉన్న అతుకుబడి నెంబర్లపై ఆందోళన చెందవలసిన అవసరం లేదని ప్రతి ఒక్క రైతుకు సంబంధిత అధికారులు తప్పక న్యాయం చేస్తారని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైల్వేకోడూరు మండలంలో 21 పంచాయతీలలో అతుకుబడి పట్టాలపై గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

## సమాచార పౌర సంబంధాల శాఖ ఆర్జేడీ సదారావును మర్యాద పూర్వకంగా కలిసిన ఏపీజేయూ రాష్ట్ర ప్రతినిధులు.




విశాఖపట్నం: : సమాచార పౌర సంబంధాల శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సదారావును ఆయన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. జర్నలిస్టుల బంధుగా పేరు తెచ్చుకున్న ఆయన డీడీ స్థాయి నుంచి ఇటీవలే ఆర్జేడీగా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో ఆయనను ఏపీజేయూ రాష్ట్ర అధ్యకుడు కాకుమాను వెంకట వేణు, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమ్మోజు రమేష్,రాష్ట్ర కార్యదర్శి నేమాల హేమసుందరరావు,మార్పు దానయ్యలు మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి అభినందన శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కన్నుమూశారు



అమరావతి : ?సీనియర్ రాజకీయ నాయకుడు మరియు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అనారోగ్యం కారణంగా మరణించారు.
ముఖ్య విషయాలు:
1953లో కిర్లంపూడిలో జన్మించారు.
1978లో జనతా పార్టీ నుండి మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
ఎన్టీఆర్ మరియు చెన్నారెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు.
వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తు
ముద్రగడ పద్మనాభం కన్నుమూత.

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూశారు. శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న ఆయన న్‌ణలోని ఓ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. 1953లో తూ.గో జిల్లా కిర్లంపూడిలో జన్మించిన ముద్రగడ.. 1978లో తొలిసారి జనతా పార్టీ నుంచి మీూాగా గెలిచారు. 1989 వరకు వరుసగా 4 సార్లు మీూా అయ్యారు. టీూ, చెన్నారెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా పని చేశారు. 2024 ఎన్నికల ముందు వైసీపీలో చేరారు.

## జీహెచ్ఎంసీ వీధి దీపాల నిర్వహణపై ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్ : హైదరాబాద్ :గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) వీధి దీపాల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1,341.60 కోట్ల స్ట్రీట్ లైటింగ్ ఓ అండ్ ఎం (ాఘ్) ప్రాజెక్టులో మార్పులకు ఆమోదం తెలిపింది. 10 ఏళ్ల పాటు ాజుణ స్ట్రీట్ లైట్ల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను సవరించింది. సీసీఎంఎస్ బాక్సుల మార్పు 6 నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ాజుణ స్ట్రీట్ లైట్ల మార్పునకు రెండేళ్ల గడువు విధించింది.అలాగే టెండర్ అర్హత ప్రమాణాల్లో కూడా మార్పులు చేసింది. సాల్వెన్సీ నిబంధనను కాంట్రాక్ట్ విలువలో 10 శాతానికి సవరించింది. ఏటా 15 వేల అదనపు లైట్లు సరఫరా చేయాలని.. 10 ఏళ్ల పాటు కొనసాగించాలని స్పష్టం చేసింది. ఈఎండీ, పెర్ఫార్మెన్స్ గ్యారంటీకి ఇన్సూరెన్స్ ష్యూరిటీ బాండ్లకు అనుమతి ఇచ్చింది. జఖాజ ప్రాంత ప్రాజెక్టుకు జీహెచ్ఎంసీ నే నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం ప్రకటించింది

## జూలై 17 న శివాజీ విగ్రహావిష్కరణకు విచేయుచున్న పద్మశ్రీ బాలకృష్ణ.



హిందూపురం: జూలై 17వ తేదీన నిర్వహించనున్న చత్రపతి శివాజీ మహారాజు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఈరోజు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ని కలిసి కార్యక్రమానికి ఆహ్వానించడం జరిగింది ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ అధ్యక్షులు చలపతి, ఆర్ఎస్ఎస్ రామాంజనేయులు ఉపాధ్యక్షులు శంకరప్ప, శివన్నవానర సేన అధ్యక్షులు ప్రణయ్ షిండే కార్యదర్శి ప్రాణేష్ తదితరులు పాల్గొనడం జరిగినది

## తెలంగాణకు మరో రెండు ఎయిర్‌పోర్టులు.. కేంద్ర మంత్రి కీలక ప్రకటన.



తెలంగాణ / వరంగల్ : తెలంగాణలో మరో రెండు ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణ ప్రజలు, ప్రత్యేకించి వరంగల్ వాసులు ఎప్పటి నుంచో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వరంగల్ (మామునూరు) ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని జూన్ 2, 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారుఎయిర్‌పోర్టుల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రే కీలకమని, భూసేకరణ పూర్తి చేస్తేనే ఇది సాధ్యమవుతుందని చెప్పారు. ఈ విషయంలో వరంగల్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణ ఒక చరిత్రలా జరిగిందని, ఇంత త్వరగా ఒక్క ఎకరా తక్కువ లేకుండా భూమిని సేకరించి తమకు అప్పగిస్తారని అనుకోలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. తాజాగా ఢిల్లీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన భేటీ ముగిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో ఎయిర్‌పోర్టుల అభివృద్ధి, ముఖ్యంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల ఏర్పాటుపై ఇరునేతలు సుదీర్ఘంగా చర్చించారు. భేటీ అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చర్చల వివరాలను వెల్లడించారు.

## హైదరాబాద్ టు అమరావతి రయ్ రయ్.. జెట్ స్పీడ్‌తో ఆర్ఆర్ఆర్ పనులు.. నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్ భేటీ..



హైదరాబాద్ : హైదరాబాద్ :తెలంగాణలో జాతీయ రహదారుల నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన సాగుతుంది. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రతిష్టాత్మక రహదారి ప్రాజెక్టులు, రీజినల్ రింగు రోడ్డు అనుమతులు, కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవేల నిర్మాణానికి సంబంధించిన వినతి పత్రాలను కేంద్ర మంత్రికి అందజేశారు. తెలంగాణకు అత్యంత కీలకమైన రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయిందని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. భూసేకరణ వేగంగా జరిగినందున, పనులను త్వరితగతిన ప్రారంభించడానికి వీలుగా కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని కోరారు. దీనితో పాటు ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి కూడా అవసరమైన అనుమతులను తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల పనులు ఒకేసారి ప్రారంభమైతే నిర్మాణం వేగంగా పూర్తికావడమే కాకుండా నిర్మాణ వ్యయం కూడా గణనీయంగా తగ్గుతుందని సీఎం స్పష్టం చేశారు. హైదరాబాద్ -- అమరావతి మధ్య 12 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీల ప్రకారం.. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఏపీ రాజధాని అమరావతికి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించాల్సి ఉందని సీఎం గుర్తుచేశారు. ప్రతిపాదిత భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్ వరకు 12 వరుసల రహదారిని మంజూరు చేయాలని కోరారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే హైదరాబాద్ -- విజయవాడల మధ్య ప్రయాణ దూరం దాదాపు 100 కిలోమీటర్లు తగ్గుతుందని వివరించారు. ఈ రహదారి ద్వారా హైదరాబాద్ నుంచి బందరు పోర్ట్‌కు సరుకు రవాణా మరింత వేగవంతమై, ఆర్థికంగా రెండు రాష్ట్రాలకు ఎంతో మేలు జరుగుతుందని సీఎం తెలిపారు

## పరువు' పేరుతో పోక్సో చట్టం దుర్వినియోగం: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : కౌమార వయస్సులో ఉన్న యువతీయువకుల మధ్య కుదిరే పరస్పర అంగీకారంతో కూడిన సంబంధాల విషయంలో 'పోక్సో' (ాాజూా) చట్టం దుర్వినియోగం అవుతోందని సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.తమ కుటుంబ ఆమోదం లేకుండా పెళ్లి చేసుకునే అమ్మాయిల విషయంలో, తల్లిదండ్రులు తమ "గౌరవం" (ఄశఄశఃఇత) కాపాడుకోవడం కోసం ఈ చట్టాన్ని ఆయుధంగా వాడుతున్నారని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు: న్యాయమూర్తులు బి.వి. నాగరత్న మరియు ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారిస్తూ కొన్ని కీలక ప్రశ్నలను లేవనెత్తింది: "ఒక అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ కలిసి పారిపోవడాన్ని ప్రభుత్వం ఎలా అడ్డుకోగలదు? పోక్సో చట్టం అనేది పిల్లలపై జరిగే లైంగిక దాడులు మరియు దోపిడీలను అరికట్టడానికి ఉద్దేశించినది." "15 నుండి 18 ఏళ్ల వయస్సు అనేది చాలా సున్నితమైన దశ. ఇటువంటి కేసులను పోక్సో పరిధిలోకి తీసుకురావడం ఎంతవరకు సమంజసం?" అని కోర్టు ప్రశ్నించింది. "తమ గౌరవాన్ని కాపాడుకునే సాకుతో తల్లిదండ్రులు ఇటువంటి కేసుల్లో క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పట్టుబడుతున్నారు. చివరకు ఇలాంటి కేసుల్లో నిందితులను నిర్దోషులుగా విడుదల చేయాల్సి వస్తోంది" అని ధర్మాసనం అభిప్రాయపడింది.అయితే, పోక్సో కేసులను పర్యవేక్షించడానికి కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక 'డాష్‌బోర్డ్'ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రతి హైకోర్టులో ఇప్పటికే బాలల హక్కుల కమిటీలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వాలే వీటిని పర్యవేక్షించగలవని కోర్టు స్పష్టం చేసింది. "చట్టం అమలులో ఆచరణాత్మకత అవసరం. చట్టం పేరుతో ఎవరి జీవితాలు నాశనం కాకూడదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది. 2012లో సమ్మతి వయస్సును (ాాన్రవ శీట ఎశఄంవఛ) 16 నుండి 18 ఏళ్లకు పెంచిన తర్వాత ఇటువంటి కేసులు పెరిగాయని, అయితే ఇవి కేవలం చట్టపరమైన సమస్యలు మాత్రమే కాదని, సామాజిక దృక్పథంతో ఆలోచించాల్సిన అంశాలని కోర్టు నొక్కి చెప్పింది.

## ఏపీలో సర్ గడువు తేదీ పొడిగింపు.. ఈసీఐ ఆదేశాలు జారీ..

అమరావతి: :ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(ాఞ=) షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం (జఙఞ) సవరించింది. సర్ గడువును ఈనెల 24 వరకూ పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2026 జులై 1ను అర్హత తేదీగా నిర్ణయించి సవరణ ప్రక్రియను కొనసాగించనున్నట్లు వెల్లడించింది. సవరించిన షెడ్యూల్‌ను రాష్ట్రంలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఇదే గడువులో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా పూర్తి చేయనున్నారు. అనంతరం జులై 31న ఓటర్ల ముసాయిదా జాబితాను (డ్రాఫ్ట్) ప్రచురించనున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను సెప్టెంబర్ 28లోగా పరిశీలించి పరిష్కరించాల్సి ఉంటుంది.అనంతరం అక్టోబర్ 3, 2026న రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం అధికారికంగా ప్రచురించనుంది. ఈ షెడ్యూల్ ప్రకారం ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపులు, చిరునామా సవరణలు వంటి ప్రక్రియలు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

## ఏపీ హాయ్యర్ ఎడ్యుకేషన్ ఫీజు రెగ్యులేటరీ చైర్మన్ గా రిటైర్డ్ జస్టిస్ కృపసాగర్ నియామకం

అమరావతి : ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి డా. జస్టిస్ వి.ఆర్.కె. కృపా సాగర్ గారిని ఆంధ్రప్రదేశ్ హాయ్యర్ ఎడ్యుకేషన్ ఫీ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమించింది. ఈయన 3 సంవత్సరాలు పదవీకాలం లేదా 70 సంవత్సరాల వయస్సు పూర్తయ్యే వరకు, ఏది ముందుగా వస్తే అది వర్తిస్తుంది. ఛైర్మన్ ప్రధాన బాధ్యతలు:
–ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ.
–ఫీజుల నిర్ణయంలో పారదర్శకత.
–విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాల పరిరక్షణ.
–విద్యాసంస్థలు చట్టాలు, నిబంధనలు పాటిస్తున్నాయా అనే అంశంపై పర్యవేక్షణ

## 200 కిలోల గంజాయి రవాణా కేసు.. సత్తెనపల్లికి చెందిన ఇద్దరి అరెస్ట్



సత్తెనపల్లి: : అనకాపల్లి జిల్లాలో వెలుగుచూసిన గంజాయి అక్రమ రవాణా కేసులో సత్తెనపల్లికి చెందిన ఇద్దరు యువకులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వాహనాల తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపేందుకు పోలీసులు ప్రయత్నించగా, అందులో ఉన్న వ్యక్తులు వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు సమాచారం. తనిఖీలు నిర్వహించిన పోలీసులు కారులో సుమారు 200 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చేపట్టిన దర్యాప్తులో ఈ అక్రమ రవాణాలో సత్తెనపల్లికి చెందిన ఇద్దరు యువకుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించి మరికొంత మంది పాత్రపై కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం

## రూ. 2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన మున్సిపల్ ఏఈ



తెలంగాణ /పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాలో అవినీతి అధికారుల గుండెల్లో ఏసీబీ రైడ్స్ ప్రకంపనలు సృష్టించాయి. మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఏఈ (ాజ) సతీష్ ఏసీబీ అధికారులకు చిక్కారు.పూర్తి వివరాల్లోకి వెళితే..మున్సిపల్ పరిధిలో జరిగిన పనులకు సంబంధించిన బిల్లులు క్లియర్ చేసేందుకు, ఏఈ సతీష్ రూ. 2 లక్షల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు బత్తుల శ్రీనివాస్ నుండి డబ్బులు తీసుకుంటున్న సమయంలో, ఏసీబీ అధికారులు అదును చూసి మెరుపు దాడి చేశారు. దీంతో ఏఈ సతీష్ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కారు. అవినీతి నిరోధక శాఖ జెడి (జీఐ) ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడితే ఇలాగే దొరికిపోతారని చెప్పకనే చెబుతోంది ఈ ఘటన. ప్రస్తుతం ఏఈ సతీష్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు, కేసు నమోదు చేసి లోతైన విచారణ జరుపుతున్నారు

## పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి: టీఎన్ఎస్ఎఫ్



ఖమ్మం : ఖమ్మం నగరం: తెలంగాణ రాష్ట్రం లో పెండింగ్ లో ఉన్న 11,300 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని టీ యన్ ఎస్ ఎఫ్ జిల్లా నాయకులు కాసాని బ్రహ్మం, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అలాగే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకి పుస్తకాలు పూర్తి స్థాయిలో అందడం లేదని తెలియజేశారు, వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యని పరిష్కరించాలని కోరారు లేకుంటే పెద్ద ఎత్తున టీ యన్ ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలతో కలెక్టరేట్ ను ముట్టడిస్తామని వెల్లడించారు

# సంపాదకీయం

## జవాబుదారీతనం కోల్పోవడంతోనే ...
## ప్రజా ఉద్యమాలు !

దేశంలో యువత తక్షణ స్పందన కోరుకుంటోంది. సమస్యలపై తక్షణ చర్యలను కోరుతోంది. రాజకీయ నాయకులు లేదా పాలకులు సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతు న్నారు. కావాలనే తాత్సారం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర నిరాశా, నిస్పృహలు ఉన్నాయి. ఏ సమయంలో చేయాల్సిన పనిని అప్పుడే చేయడం లేదు. నాన్చివేత ధోరణి కారణంగా దేశం అడుగు ముందుకు వేయడం లేదు. జిఎస్టీని తీసుకుని వచ్చి గొప్పలు చెప్పారు. ప్రజలు దీనికి బలవుతున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు జీఎస్టీ శ్లాబ్‌లను తగ్గించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆహార ధరలు పెరుగుతున్నా పట్టింపు లేదు. మందుల మాఫియాను అరికట్టడం లేదు. అవినీతి వేళ్లూనుకుని పోయింది. అయినా పట్టించుకోవడం లేదు. ఇలా ఒకటేమిటి అనేకానేక సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ పట్టించుకోక పోవడం వల్లనే ..నీట్ పేపర్ లీక్ తరవాత యువత ఉద్యమించింది. ఇది మొదలూ కాదు..అంతం కూడా కాదని పాలకులు గుర్తించాలి. ఇంతటితో ఇక పీడ విరగడ అయ్యిందని పాలకుల భావిస్తే అంతకుమించి మూల్యం చెల్లించుకో తప్పదు. యువత బొద్దింకలుగా మారి దేశ రాజధాని ఢిల్లీని చుట్టుముట్టే పరిస్థితి ఎందుకొచ్చిందని ఆత్మపరిశీలన చేసుకోవాలి. పార్లమెంట్ జరుగుతోంది. అయినా సమస్యలపై చర్చించడం లేదు. ఆరోరోజు కూడా విపక్షాలు ప్రధాని మోడీ, అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సభాసమయాన్ని వృధా చేస్తున్నాయి. ఇది ప్రజల సమయం, ప్రజలు ఇచ్చిన అధికారం అని గుర్తించాలి. ఇలాగే చేస్తూ పోతే..పార్లమెంటులో గబ్బిలాల్లా ఏళ్ల తరబడి పట్టుకుని వేళ్లాడుతున్న నేతలను కూడా తొలగించడానికి ఉద్యమించక తప్పదేమో. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనేక సందర్భాలలో జరిగాయి. దశాబ్దాల క్రితం ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పుడే ఎందుకింత ఉద్యమం జరిగిందంటే కారణం యువతలో ఉన్న ఆక్రోశమని గుర్తించాలి. నాయకుల తీరుపట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయని గ్రహించాలి. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే మూల స్తంభాలు తమ బాధ్యతల నుంచి దూరం జరగడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణం.చట్టసభల్లో సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపడం లేదు. అసలు సమస్యలనే గుర్తించడం లేదు. ఇకవాటిపై చర్చల గురించి ఆలోచన తరవాత. ప్రధాన ప్రతిపక్షం సమస్యలపై చర్చ చేయకుండా సభను స్తంభింప చేయడం మాత్రమే చేస్తోంది. అధికార పక్షం ప్రజల సమస్యలకు జవాబు ఇవ్వడం లేదు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం పార్లమెంటును నడపుతున్నారా అన్న భావన కలుగుతోంది. బొద్దింకలు చేపట్టిన ఆందోళన విరమణతో ప్రస్తుత సమస్య తాత్కాలికంగా సమసిపోతే పోవచ్చు. కానీ ప్రధాన వ్యవస్థలు తమ బాధ్యతను గుర్తించి మెలగని పక్షంలో మరో సమస్య వచ్చినప్పుడు ఆందోళనలు ఇంతకు మించి ఊపందుకుంటాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నందువల్లే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నాం. దానిని బలహీనపరచడమంటే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. వ్యవస్థలకు వ్యతిరేకంగా కాకుండా వాటిల్లో జవాబుదారీ తనాన్ని తీసుకురావడానికి పోరాడవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది. కాక్రోచ్ జనతా పార్టీ కోరుతున్నది అదే కనుక నేతలు తమ పద్ధతిని మార్చుకుంటే మంచిది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒక సామాన్యుడైన అభిజీత్ దీప్కే ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ వెనుక నిలబడడం ద్వారా కాంగ్రెస్ తదితర పార్టీలు ఓ రకంగా తమ ఉనికిని కోల్పోయాయనే చెప్పాలి. వారు చేయాల్సిన పనిని వారి పార్టీలు చేయలేకపోయాయి. ఈ దుస్థితి ఎందుకొచ్చిందో రాజకీయ పార్టీలు ప్రశ్నించుకోవాలి. సామాన్య ప్రజలు చేపట్టిన ఆందోళనకు దిగి రావాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో పాలకులు కూడా గ్రహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను, ప్రత్యర్థులను భయపెడుతూ ఎంతో కాలం మనుగడ సాగించలేమని పాలకులు గుర్తించాలి. ప్రజాస్వామ్యం మౌలిక సూత్రాలను ఆచరించి అమలు చేస్తామన్న నమ్మకాన్ని పాలకులు ప్రజల్లో కల్పించాలి. . పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన తరవాతనే కేంద్ర ప్రభుత్వ పెద్దలు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు. సోషల్ మీడియా ఇంతలా విస్తరించిన ఈ కాలంలో ఏ విషయాన్నీ కూడా దాచిపెట్టలేమని ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు గుర్తించాలి. ముఖ్యంగా యువతలో పేరుకుపోతున్న నిరాశా నిస్పృహలకు సమాధానం చెప్పాలి. పార్లమెంటులో ఎప్పటికప్పుడు ప్రధాన సమస్యలపై అర్థవంతమైన చర్చలు సాగాలి. సమస్యలు పరిష్కారం అయ్యేలా తక్షణ చర్యలకు పూనుకోవాలి. దశాబ్దాలుగా సమస్యలను నానపెడుతూ మరిని కొత్త సమస్యలకు కారణం కారాదు. అలాగే పాలకులు విలాసాలు వీడాలి. ప్రజల సొమ్ముకు జవాబుదారీ తనాన్ని అలవర్చుకోవాలి. జల్సాలు చేసేందుకు చేసే ప్రయత్నాలను ఇప్పటికైనా ముగించాలి. లేదంటే ఏ చిన్న సంఘటన జరిగినా ఆందోళనలు మరింత ఉధృతంగా పుట్టుకురావొచ్చు. ఇప్పుడున్న నేతలు ఎవరినీ ప్రజలు ఎవరినీ నమ్మలేని పరిస్థితి ఏర్పడుతోంది. దానిని అధిగమించకపోతే పాలకులకు ఎదురుదెబ్బలు తప్పవు..

## ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాలు

● శాకంబరిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ



**విజయవాడ,జూలై 27:** ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ సన్నిధిలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా వివిధ రకాల ఆకుకూరలు, పండ్లు, కూరగాయల అలంకారంతో దుర్గమ్మ దర్శనమిస్తున్నారు. మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణమంతా కూరగాయలతో అలకరించారు. ఆషాఢ మాసంలో ప్రత్యేకంగా శాకంబరీ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సకాలంలో వర్షాలు పడి, పాడిపంటలు పండి, దేశం సస్యశ్యామలంగా ఉండేందుకు ప్రతి ఏడాది శాకంబరీ ఉత్సవాలను నిర్వహిస్తారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో శాకంబరీ దేవిగా దుర్గమ్మ దర్శనమిస్తారు. ఉత్సవాల సందర్భంగా దుర్గమ్మ సన్నిధికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జై దుర్గా.. జై జై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. అమ్మవారి ఒంటి మీద నుంచి తీసిన శాకాలతో కదంబ ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు పంపిణీ చేస్తారు. కదంబ ప్రసాదాన్ని స్వీకరిస్తే అనారోగ్యాలు పోయి ఆరోగ్యంగా ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివస్తుండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

### తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్



**హైదరాబాద్,జూలై27:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిచింది.ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్దిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లుల నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

# అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు

### వరుసపెట్టి దాడులు చేస్తున్న ఎసిబి
### వందల కోట్లలో అక్రమాస్తుల గుర్తింపు




**హైదరాబాద్,జూలై27:** రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ మరోమారు కొరడా ఝుళిపిస్తోంది. ఇటీవలి కాలంలో వరుసపెట్టి పెద్దపెద్ద చేపలను పట్టేస్తోంది. చిన్నాచితక కేసులు నమోదు అవుతున్నా, పెద్ద చేపల విషయంలో ఎసిబి పక్కాగా సమాచారం సేకరించి దాడులు చేస్తోంది. దాడుల్లో వందల కోట్ల ఆస్తులను గుర్తించి సీజ్ చేస్తోంది. అవినీతి పట్ల ప్రభుత్వం కూడా కఠినవైఖరి అవలంబిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలతో నిత్యం సంబంధం ఉండే శాఖల్లో అవినీతి ఎక్కువగా ఉందనే ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ ఆయా శాఖల అధికారులపై దృష్టి కేంద్రీకరించింది. ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులు, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ విభాగాల నుంచి అందిన సమాచారం ఆధారంగా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన 100 మంది అధికారులపై నిఘా కొనసాగుతోంది.ఇప్పటికే 65 మంది అధికారులపై ప్రాథమిక స్థాయిలో సమాచారం సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఏసీబీ దృష్టిలో అత్యధికంగా రెవెన్యూ, పోలీస్, జీహెచ్ఎంసీ, ఆర్టీఏ, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ శాఖలు ప్రజలకు నేరుగా సేవలు అందించే విభాగాలు కావడంతో లంచాలు, అక్రమ లావాదేవీలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గతంలో వచ్చిన ఆరోపణలు సూచించాయి.కేవలం ఫిర్యాదుల ఆధారంగా కాకుండా గత ఆరు నెలలుగా అనుమానిత అధికారుల ఆర్థిక లావాదేవీలు, స్థిరాస్తులు, బ్యాంకు ఖాతాలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తులు, బినామీ లావాదేవీలు వంటి అంశాలపై ఏసీబీ నిఘా పెట్టినట్లు సమాచారం. దీని కోసం వీడియో రికార్డింగ్‌లు, డాక్యుమెంటరీ ఆధారాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, బ్యాంకింగ్ లావాదేవీలు వంటి సాక్ష్యాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. పక్కా ఆధారాలు లభించిన తర్వాతే దాడులు, కేసులు నమోదు చేసే విధానాన్ని ఏసీబీ అనుసరిస్తోంది. ఇటీవలి కాలంలో ఆదాయానికి మించిన ఆస్తులు కేసుల్లో పలువురు ప్రభుత్వ అధికారులపై కేసులు నమోదు చేసిన ఏసీబీ ఇప్పటికే 10 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సమాచారం. ఈ చర్యలు మిగతా అధికారుల్లోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. అవినీతిని ఏ మాత్రం ఉపేక్షించబోమని ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీకి స్వేచ్ఛ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. శిక్షలు కఠినంగా ఉంటేనే మిగతా అధికారులకు హెచ్చరికగా నిలుస్తాయని ప్రభుత్వ పెద్దలు కూడా అభిప్రాయపడినట్లు సమాచారం. అవినీతిని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత ముఖ్యమైనది. లంచం డిమాండ్ చేసిన అధికారులు లేదా అక్రమాస్తులపై విశ్వసనీయ సమాచారం ఉంటే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ లేదా ఇతర అధికారిక మార్గాల ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు తరచూ సూచిస్తున్నారు. అవినీతి కేసుల్లో దాడులు నిర్వహించడం ఒక దశ మాత్రమే. అనంతరం ఆస్తుల మూలాలను నిరూపించడం, కోర్టులో బలమైన సాక్ష్యాలను సమర్పించడం, చివరకు శిక్షలు పడేలా చేయడం మరింత కీలకమైన ప్రక్రియ. గతంలో కొన్ని కేసులు సాక్ష్యాల లేమితో బలహీనపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల ఈసారి పక్కా ఆధారాలతోనే ముందుకు వెళ్లాలని ఏసీబీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# యువరక్తమూ- అల్పత్వము




వెలుగుతున్న ఆశ ఒకవైపు, కొనసాగుతున్న అల్పత్వము మరోవైపు. నేడు దేశ కదలికను గమనిస్తుంటే భవిష్యత్తు పట్ల ఆశలు చిగురిస్తున్నాయి. ఏం చేయలేమనే నిరాశ నుంచి ఏదైనా చేయగలమనే ధైర్యం నిండుతోంది. మాకిక తిరుగులేదనుకున్నవారికి తలలు తిరిగేట్టు జరగటం చూస్తుంటే సామాజిక శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలు, సిద్ధాంతాలు ఎంత వాస్తవికమైనవో అర్థమవుతున్నది. నిరసనల నిప్పురవ్వ అంటుకుంటే ఎంత దావానలమై ముంచెత్తుతుందో స్పష్టపరిచింది నేటి యువత తిరుగుబాటు. గత 38 రోజులుగా ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిరవధికంగా జరుగుతున్న నిరసన అత్యంత పదునైన దీక్షతో కొనసాగటం అనేకమంది రాజకీయ నాయకులను, సామాజిక కార్యకర్తలను, సాధారణ ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నది. నిర్మాణ రూపమే లేని ఒక సోషల్ మీడియా 'కాక్రోచ్' యువత, ఇంత నిబద్ధంగా, పట్టుదలతో,క్రమశిక్షణతో ఉద్యమాన్ని నిర్మించడం చూస్తే, ఎక్కడ అణచివేత, దోపిడీ వేదన ఉంటుందో అక్కడ తిరుగుబాటు తప్పదన్న సత్యం రుజువుతున్నది. నిర్మాణాత్మక వామపక్ష విద్యార్థి ఉద్యమమూ తోడుగా చేరటము మరింత పదునుతేరుతున్నది. ఇదో శుభపరిణామం."పదిమంది ఉక్కు గుండెలుగల యువకులను నాకివ్వండి, నేను ఈ దేశాన్ని మార్చివేస్తాను" అని స్వామి వివేకానంద చెప్పిన మాటలు ఈ సన్నివేశాన్ని చూస్తే ఎంతో నిజమని అర్థమవుతున్నది.నిరసన చాలా సామాన్యంగానే ప్రారంభమ యింది. ప్రభుత్వమూ పెద్దగా పట్టించుకోకుండా తేలికగానే చూసింది. జూలై ఇరవై తర్వాత నిరసన ఉద్యమ రూపం అందుకుంది. దేశవ్యాప్తంగా యువత కదం తొక్కింది.బీజేపీ తిరుగులేని ఆధిపత్యం వహిస్తున్న రాష్ట్రాల నుంచి అన్ని ప్రాంతాలలోనూ ప్రశ్నతో, నినాదంతో మార్మోగింది. ఇక్కడేకాదు, దేశం వెలుపల, అనేక దేశాలలో యువత మద్దతును ఈ ఉద్యమం పొందింది. అప్పటిగానీ అయ్యావార్లకు అర్థంకాలేదు. ఎన్ని ఆటంకాలు ఎగదోసింది ప్రభుత్వం! ఎంత దుష్ప్రచారం మొదలైంది. ఎంత దారుణంగా క్రూరంగా అణచివేయటానికి పూనుకొంది. రక్తం పారించింది. తలలు పగలగొట్టింది. చేతులు, కాళ్లు విరగగొట్టింది. రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్ లు, ముండ్ల కంచెలు, దేశద్రోహ కేసులు, నిర్దాక్షిణ్య నిర్బంధాలు అన్నీ ఉపయోగించింది. ఇంకోవైపు నైతికతను దెబ్బతీస్తూ, విదేశీయుల సహకారంతో, మద్దతుతో నడుస్తోందని, సంఘవిద్రోహ శక్తులని, దేశ సమగ్రతను, శాంతిని విచ్ఛిన్నం చేసే కుట్ర జరుగుతోందని, దొంగ దీక్షలు చేస్తున్నారని ఒక నీచ ప్రచారము చేసింది. నీళ్లను బంద్ చేసింది. కరెంటునూ, ఇంటర్నెట్ నూ, రహదారులను, మెట్రో స్టేషన్లను బంద్ పెట్టి నిలిపివేసింది.ఇన్ని చేసినా, ఇంత విధ్వంసం ఒక రాజ్యం చేస్తున్నా... నిలకడగా నిబ్బరంగా వీటన్నింటినీ ఎదుర్కొని ఇన్ని రోజులుగా పోరాటం కొనసాగటం చరిత్రలో నిలిచిపోయే మహా సంఘటన. ఇది ఒక పరీక్ష పేపర్ లీకేజీ సమస్యే కాదు, విద్యావ్యవస్థ మొత్తం ప్రయివేటు, కార్పొరేట్ల చేతుల్లోకి పోవడం, పర్యవసానంగా వ్యాపారం, లాభాలు మాత్రమే లక్ష్యంగా మారింది. నిరుద్యోగం, పరిశ్రమల మూత, గ్రామీణ ప్రజల ఆదాయాల కోత, ధరల పెరుగుదల, హక్కుల అణచివేత అన్నిటి ప్రభావాల ప్రతిఫలనం ఈ ప్రతిఘటన. ప్రశ్నించినవాళ్లను , న్యాయం అడిగినవాళ్లను దేశద్రోహులుగా చూస్తున్న ప్రభుత్వ నియంతృత్వ పోకడపై వెల్లువెత్తిన ఆగ్రహం ఇది. ముప్పయి రోజుల తర్వాత, యువత దేశానికి అతి ముఖ్యమైన శక్తి అని, వారి సమస్య దేశపు సమస్య అని ప్రధాని మాట్లాడటం సిగ్గులేనితనం.

# కలెక్టర్ రాం సుందర్‌రెడ్డిని అభినందించిన మంత్రులు అచ్చెంన్నాయుడు, కొండపల్లి

- మన్ కీ బాత్‌లో జిల్లాపై మోదీ ప్రశంసలు గర్వకారణం





**విజయనగరం, జూలై 27 :** జలధార జలహారతి పథకం అమలు తీరుతో విజయనగరం జిల్లాను దేశంలోనే ముందంజలో ఉండేలా చేసిన జిల్లా కలెక్టర్ రాం సుందర్‌రెడ్డిని మంత్రులు కె. అచ్చెంన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో విజయనగరం జిల్లాను ప్రత్యేకంగా ప్రస్తావించడం జిల్లా వాసులు గర్వించదగ్గ విషయం అని మంత్రులు కొనియాడారు. సోమవారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ హరిత విమానాశ్రయం సమావేశ మందిరంలో రాం సుందర్ రెడ్డిని శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జలధార జలహారతి కార్యక్రమంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లి దేశ ప్రధాని మోదీ గారిచే కితాబు అందుకోవడం సంతోషకరమన్నారు. విజయనగరం జిల్లాను అన్ని విభాగాల్లో కూడా ప్రథమస్థానంలో ఉండేలా అధికారులు కృషి చేసేందుకు ఇది ఒక ఆదర్శనీయమైన గుర్తింపు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వి. దామోదర్, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ, విశాఖ మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, జూలై 27 :** మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజె. అబ్దుల్ కలాం జీవితం ప్రతి భారతీయుడికి ఆదర్శనీయం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్థానిక మంత్రి గారి క్యాంప్ కార్యాలయం నందు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి పేపర్ బాయ్‌గా పనిచేసిన ఒక యువకుడు దేశంలో అత్యున్నతమైన రాష్ట్రపతి పదవి అలంకరించే స్థాయికి ఎదగడం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి అన్నారు. తన మేధాశక్తితో అణు పరీక్షల నిర్వహణలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అలాగే ఇస్రోలో చేరి మొట్టమొదట స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం ఎస్ఎల్‌వీ 3 తయారీలోనూ పనిచేశారని ప్రశంసించారు. నేటి యువత అబ్దుల్ కలాం గారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని మంత్రి పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులతో పాటు మంత్రిగారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు నినాదంతో విమానాశ్రయ కార్యక్రమాలు నిర్వహించండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు



**విజయనగరం, జూలై 27 :** అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ హరిత విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాలు అన్నీ ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు అనే నినాదంతో నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం రాత్రి ఎయిర్‌పోర్ట్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లో మంత్రులు కే అచ్చెంన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కలెక్టర్ రామ సుందర్ రెడ్డి, ఎస్పీ దామోదర్, జేసీ సేతు మాధవన్, విశాఖపట్నం మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్, ఇతర అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. చారిత్రాత్మకమైన విమానాశ్రయ ప్రారంభ కార్యక్రమంలో ఆరు జిల్లాల కలెక్టర్లు పోటీపడి పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర గేమ్ చేంజర్‌గా మారుతుందని.. ఉత్తరాంధ్ర ఆరు జిల్లాలలో.. ముఖ్యంగా యువకుల్లో చైతన్యం నింపడం కోసం, వాలీబాల్, 5 ఎ రన్ 3 కే రన్ 1 ఎ రన్ నిర్వహించడంతోపాటు, పాటలు, పద్యాల పోటీలు, సోషల్ మీడియా కాంపిటేషన్‌తో పాటు ఆరు జిల్లాల నుంచి వివిధ విభాగాలలో గెలుపొందిన 600 మంది విజేతలను ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే విమానాశ్రయం ఏర్పాటు వలన కలిగే లాభాలు, ప్రయోజనాల గురించి చిన్నారులకు క్విజ్ డ్రాయింగ్ వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. విజయనగరం జిల్లా నాయకులు, అధికారులు ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన భూమి నుంచి భవిష్యత్తు వరకు కార్యక్రమం, కౌంట్ డౌన్ క్లాక్ ఏర్పాటు ప్రశంసనీయమని కొనియాడారు. 31వ తేదీ రాత్రి నుంచే ఎయిర్‌పోర్ట్ స్థలంలో డ్రోన్ షో ఏర్పాటు చేయాలని.. విమానాశ్రయ ప్రాంగణంలో దేశం మనది అనే భావన, స్ఫూర్తి నింపడం కోసం పిల్లలతో జాతీయ జెండాలతో ప్రధాని నరేంద్ర మోడీ గారికి స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విమానాశ్రయ ప్రారంభ సమయంలో 13వేల మంది నృత్య కళాకారులతో ప్రదర్శించే ఉత్తరాంధ్ర థింసా నృత్యం గిన్నిస్ బుక్ రికార్డు సాధించేలా చేయాలన్నారు. అలాగే కోవిడ్ 19 నేపథ్యంలో ఆరోగ్యశాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని... ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముఖ్యంగా భోజనాలు, రవాణా, వైద్యం, టాయిలెట్స్ విషయంలో పగడ్బందీగా పని చేయాలని సూచించారు. ఈ ప్రారంభ కార్యక్రమాన్ని స్థానిక తెలుగు ఛానల్స్ తో పాటు 11 ఇంటర్నేషనల్, 25 నేషనల్ మీడియాల ద్వారా ప్రసారం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రజల కోసం కలెక్టరేట్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

- సుమారు 130 మందికి ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ
- ఆయుర్వేదం ద్వారా తక్కువ ఖర్చుతో దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు

....జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ





**విజయవాడ: జూలై 27,2026.**
జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. శిబిరంలో ప్రజలకు అందిస్తున్న చికిత్సలు, మందుల పంపిణీ, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏహెచ్ఐఎంఎస్ (ఆయుష్మాన్) యాప్ ద్వారా ఇప్పటివరకు ఎంతమంది రోగులు నమోదు చేసుకున్నారో సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో డిజిటల్ విధానాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల కోసం ప్రత్యేకంగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రజలు తమ పనులతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పించడం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంపొందుతుందని పేర్కొన్నారు. ఆయుర్వేదం భారతదేశానికి చెందిన ప్రాచీన వైద్య విధానమని, జీవనశైలి సంబంధిత వ్యాధుల నివారణలో, దీర్ఘకాలిక ఆరోగ్య సంరక్షణలో దీనికి విశేష ప్రాధాన్యత ఉందన్నారు. తక్కువ ఖర్చుతో దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఆయుర్వేద వైద్యాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైద్య అధికారులకు సూచించారు. ఆయుర్వేద వైద్యం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), చర్మవ్యాధులు, దగ్గు, రొంప, మోకాళ్ల నొప్పులు, కీళ్ల సంబంధిత వ్యాధులు తదితర ఆరోగ్య సమస్యలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేశారు. రోగులకు ఆహార నియమాలు, జీవనశైలి మార్పులు, ఆయుర్వేద చికిత్స విధానాలపై కూడా వైద్యులు సూచనలు అందించారు. ఈ శిబిరంలో సుమారు 130 మంది ప్రజలు వైద్య సేవలను పొందగా, ఉచితంగా మందులను అందజేశారు.

# ప్రజలతో మమేకమై.... రెండేళ్ల నమ్మకం

ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు





**గజపతినగరం, జూలై 27 :** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు "రెండేళ్ల నమ్మకం - సంక్షేమం, అభివృద్ధి" కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రజలతో మమేకమై కార్యక్రమాన్ని నిర్వహించారు. గజపతినగరం నియోజకవర్గం మరుపల్లి గ్రామంలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందించిన పథకాలను, వాటి వివరాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం ప్రజల్లో అత్యంత ఆదరణ పొందిందని, మహిళలు ఈ పథకం బాగా ఉపయోగపడిందని చెప్పటం సంతోషాన్ని కలుగ చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించాలన్నారు. పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసి చైర్మన్ పివివి గోపాల్ రాజు, మక్కువ శ్రీధర్, పిఎసిఎస్ చైర్మన్ లెంక బంగారు నాయుడు కూటమి నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జి లు పాల్గొన్నారు.

# మంత్రి గారి ఆట విడుపు

- అమరావతి ఛాంపియన్షిప్ పోటీలను ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు
- ఆటలలో గెలుపు ఓటములు సహజం
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారికి కృతజ్ఞతలు





**గజపతినగరం, జూలై 27,** మండలంలోని మరుపల్లి మోడల్ హైస్కూల్ నందునియోజకవర్గస్థాయి అమరావతి ఛాంపియన్షిప్ పోటీలను సోమవారం రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రారంభించి, క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూవి ద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడుతూ ఉంటే బాల్య జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారులలో ప్రతిభను వెలుక తీయడం కోసం నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు ఏర్పాటు చేయడంతో పాటు నగదు బహుమతులు ప్రకటించడం జరిగిందన్నారు. అలాగే స్పోర్ట్స్ కోటాను రెండు నుంచి మూడు శాతానికి పెంచిన ఘనత నారా లోకేష్ గారికి దక్కుతుందన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక వ్యాయామంతో పాటు ఆరోగ్యం కూడా రక్షించుకోవచ్చన్నారు. విద్యార్థి దశలో క్రీడల్లో ప్రతిభ చాటి సర్టిఫికెట్లు పొందినట్లయితే ఉద్యోగ సమయాల్లో ఉపయోగపడతాయని తెలిపారు. ఆటలలో, చదువులో గెలుపు, ఓటములు, ప్రథమ తృతీయ స్థానాలు సాధారణమని, ఓటమితో కృంగిపోకుండా గెలుపు కోసం ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రొద్దుటూరులో ఘనంగా కర్నూల్ వాలే సాహెబ్ గంధం మహోత్సవం

-హజ్రత్ సయ్యద్ షా జహరుద్దీన్ హుస్సేనీ స్వామి (కర్నూల్ వాలే సాహెబ్) వద్ద ప్రత్యేక ప్రార్థనలు
-జిల్లా నలుమూలల నుంచి పాల్గొన్న పీఠాధిపతులు
- రాష్ట్ర షేక్ కార్పొరేషన్ చైర్మన్ డా. వి.ఎస్. ముక్తియర్ హాజరు
- భక్తులకు అన్నదానం

























సలాం ప్రొద్దుటూరు: కడప జిల్లా ప్రొద్దుటూరులోని గోల్డ్ మార్కెట్‌లో వెలసిన హజ్రత్ షా హుస్సేన్ వలి స్వామి దర్గా షరీఫ్ ప్రాంగణంలో ఉన్న హజ్రత్ సయ్యద్ షా జహరుద్దీన్ హుస్సేనీ చిశ్తీ ఉల్ ఖాద్రి ఉర్ఫ్ కర్నూల్ వాలే సాహెబ్ వార్షిక గంధం మహోత్సవం శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంగా నిర్వహించారు. ఆస్థానే జాహరియా పీఠాధిపతి సయ్యద్ షా ముబీన్ హుస్సేనీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో సాయంత్రం 5 గంటల నుంచి ఫకీర్ల ఆధ్వర్యంలో నాత్ షరీఫ్, ఖవ్వాలీ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఇషా అజాన్ తర్వాత స్వామివారి మజార్ షరీఫ్‌కు గంధం సమర్పించి, పూల చాదర్లు, అత్తర్ సమర్పించి సిజ్రా షరీఫ్ పఠనంతో ప్రత్యేక దువాలు చేశారు. ఈ సందర్భంగా కడప ఆస్థానే షామిరియా పీఠాధిపతి సయ్యద్ షా అహ్మద్ పీర్ షామీరి దేశ ప్రజలు సుఖశాంతులతో, ఆరోగ్యంగా ఉండాలని, స్వామివారి అనుగ్రహంతో భక్తుల కష్టాలు తొలగాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షేక్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ వి.ఎస్. ముక్తియర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహనీయుల బాటలో నడుస్తూ మానవతా విలువలను ఆచరించాలని, సమాజంలో సోదరభావం, శాంతి నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు భారీ స్థాయిలో అన్నదానం (లంగర్) నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు మహోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. గంధం మహోత్సవ ఏర్పాట్లను బిరాదరే సజ్జద్-ఎ-నషీన్ సయ్యద్ షా మతిన్ హుస్సేనీ సాహెబ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆస్థానే కమాలియా పీఠాధిపతులు సయ్యద్ షా అబిదుల్లా హుస్సేనీ, సయ్యద్ షా అరిఫుల్లా హుస్సేనీ, ఆస్థానే గౌసియా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్ పీరా ఖాద్రి సాహెబ్‌తో పాటు వివిధ దర్గాల పీఠాధిపతులు, మత పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Published and Owned by Banaganapalli Shaik Khajamohiddin, Printed at M/s. VSAR PUBLICATIONS, D.No. 4-50, NEHRU ROAD, PRODDATUR, Y.S.R., ANDHRA PRADESH - 516360. and Published from D.No. 4-50, NEHRU ROAD, PRODDATUR, Y.S.R., ANDHRA PRADESH - 516360 Editor : Banaganapalli Shaik Khajamohiddin,
PRGI No. APTEL/26/A4268, Cell No: 9491430896, E-mail: b.s.khajamohiddin@gmail.com